Follow: @ANNTELUGU
ANN తెలుగు
29-01-2025
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 58 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## నాగోబా జాతర ఆరంభం

**ముఖ్యమంత్రి రేవంత్, మాజీ సీఎం కేసీఆర్, పీసీసీ చీఫ్ మహేష్, మంత్రి సీతక్క శుభాకాంక్షలు**

ఆదిలాబాద్, మహా: గిరిజనుల ఆరాధ్య దైవమైన కేస్లాపూర్ నాగోబా జాతర ప్రారంభం కానుంది. అర్ధ రాత్రి నాగోబాకు మెస్రం వంశీయులు మహాపూజ చేయడంతో పాటు కేస్లాపూర్ నాగోబా గంగాజలాభిషేకం, మహా పూజతో ప్రారంభం కాగా, ఫిబ్రవరి 4వ తేదీ వరకు జరుగుతుంది. సమ్మక్క సారలమ్మ జాతర తర్వాత ఆదిశేషుని నాగోబా జాతర దేశంలోనే రెండో అతిపెద్ద గిరిజన జాతర. మెస్రం వంశస్థులు కాలినడకన బయలు దేరి వెళ్లి కొత్త కుండలతో కడెం మండలంలోని గొడిసిర్యాల పరిసర ప్రాంతాల్లో ప్రవహిస్తున్న గోదావరి జలాన్ని తీసుకొచ్చి.. నాగోబాను అభిషేకిస్తారు. నాగోబా జాతరకు తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది.. 600 మంది పోలీసులు, 100 సీసీ కెమెరాలతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. మరోవైపు.. నాగోబా జాతర సందర్భంగా భక్తులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి సీతక్క లతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు, నేతలు భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో రెండో అతి పెద్ద గిరిజన జాతర నాగోబా అని అన్నారు. నాగోబా జాతరకు రాష్ట్రం నుంచి కాకుండా.. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో గిరిజనులు తరలివస్తున్నారు.

**టాప్ న్యూస్**

### మీ రాజకీయాలు అందరికీ అర్థమయ్యాయి



- కేజ్రీవాల్ పై రాహుల్ గాంధీ సీరియస్
- ఢిల్లీలో ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం

03

### చరిత్ర సృష్టించిన తెలంగాణ అమ్మాయి త్రిష



- 50 బంతుల్లో సెంచరీ
- టోర్నీలో టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్న త్రిష

08

### మహా కుంభ మేళాకు భోజనానికి ఏం సంబంధం



- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే వ్యాఖ్యలపై రాజాసింగ్ కస్సు
- బుద్ధిలేని అధ్యక్షుడని ప్రజలు నవ్వుతున్నారు
- కుంభమేళాలో పుణ్య స్నానమాచరించిన బీజేపీ ఎమ్మెల్యే

02



## నిర్మలమ్మ ఏం చేస్తారో!?

- బడ్జెట్‌లో ఊరట కోసం సామాన్యుల ఎదురుచూపులు
- ధరాఘాతంతో బెంబేలెత్తుతున్న ప్రజానీకం
- ఎదుగూ బొదుగూ లేని ఆదాయం
- వెంటాడుతున్న నిరుద్యోగం.. పన్నుల భారంతో కుదేలు

న్యూఢిల్లీ, మహా : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిదో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతుండగా సామాన్య ప్రజలు మాత్రం ఆమె ప్రకటించే 'ఊరట' చర్యల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఆకాశాన్ని తాకుతున్న ఆహార వస్తువులు ముఖ్యంగా కూరగాయల ధరల్ని నేలకు దించాలని వారు కోరుకుంటున్నారు. అరకొర ఆదాయంతో బతుకు బండిని లాగుతున్న కుటుంబాలు ధరాఘాతంతో బాగా ఇబ్బంది పడుతున్నాయి.

మిగతా 2లో

## ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఫ్రీ



- ఇసుక మాఫియాపై ఉక్కుపాదం
- అక్రమాలు సహించం

ఇసుక పాలసీపై అధ్యయనానికి కమిటీ నియామకం

వారంలోపు నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశం

**హైదరాబాద్, మహా :** ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఏ విధంగా సరఫరా చేయాలనే దానిపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అధ్యయన కమిటీ సభ్యులుగా రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, టీజీ ఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్‌లను నియమించారు. ఈ కమిటీ వారంలోపు తమ అధ్యయనాన్ని పూర్తి చేసి సమగ్ర విధివిధానాలతో నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా, గనుల శాఖపై సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో

### త్రిలియన్ ఎకానమీ పక్కా

వివరాలు 8లో





## గద్దర్ అవార్డు చుట్టూ రచ్చరచ్చ

వ్యూహాత్మకంగా బండి సంజయ్ వ్యాఖ్యలు..

బండి వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న కాంగ్రెస్

క్షమాపణ చెప్పాల్సిందేనన్న పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

విరుచుకుపడుతున్న గద్దర్ అభిమానులు.. తెలంగాణ ఉద్యమకారులు

బండిని కేంద్రమంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్లు

మెడ మీద తలకాయ ఉన్నోళ్లు సంజయ్ లాగా మాట్లాడరు : టీపీసీసీ ప్రధానకార్యదర్శి రవళిరెడ్డి

మందకృష్ణకు అవార్డు ఇస్తే ఎందుకు మెచ్చుకోరంటూ బీజేపీ ఎదురుదాడి

మందకృష్ణ మాదిగ గద్దర్ కంటే 100 రెట్లు గొప్ప : బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ

03



### సీపీఎం కార్యదర్శిగా తొలిసారి దళితుడు

- జాన్ వెస్లీని ఎన్నుకున్న నాయకత్వం
- వయసు రిత్యా తప్పకున్న వీరభద్రం

వివరాలు 2లో



### కొమురవెల్లిలో అఘోరి వీరంగం

- బట్టలేసుకొమ్మన్నందుకు కత్తితో హింసాకాండ
- పలువురికి గాయాలు

వివరాలు 2లో



### ముస్లిం మహిళ పిటిషన్‌పై అభిప్రాయం చెప్పండి

- కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం
- షరియత్ నుంచి మినహాయించండంటూ పిటిషన్ వేసిన మహిళ
- మే 5న వాదనలు వింటామన్న అత్యున్నత న్యాయస్థానం

వివరాలు 7లో

### కార్టూ 'నిజం'





## చంద్రబాబుది బ్రాడ్ మైండ్

ఆయన ఎలాంటి వారో దగ్గర నుంచి చూశా

మీడియా ఇష్టాగోష్టిలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ ను డిస్ట్రబ్ చేయాలని చంద్రబాబుకు లేదు

పెట్టుబడులపై వ్యూహాత్మకంగా వెళ్తున్న నేత అని కితాబు



**హైదరాబాద్, మహా :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి డీ.శ్రీధర్ బాబు విలేకర్లతో ఇష్టా గోష్టిగా మాట్లాడుతూ, దావోస్‌లో చంద్రబాబు వ్యవహరించిన తీరుపై ప్రశంసల వర్షం కురిపించారు. సీఎం చంద్రబాబు నాయుడిది బ్రాడ్ మెంటాలిటీ అని అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్‌కు గ్లోబల్ కేపబులిటి ఉందని పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబుతో తాను మాట్లాడానని పేర్కొన్నారు.

మిగతా 3లో

### హైదరాబాద్‌లో మరో రెండు ఐటీ పార్కులు

03

### రాష్ట్రంలో డిమాండ్‌కు తగ్గ ఎరువుల నిల్వలు

ఎరువుల పంపిణీలో రైతులకు ఇబ్బంది తలెత్తవద్దు

- గోదాముల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి
- సంస్థ స్థలాలలో కొత్త గోదాముల నిర్మాణం చేపట్టాలి
- గోదాములపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వివరాలు 3లో

### గద్దర్‌పై బండి వ్యాఖ్యలను ఖండిస్తున్నా



- స్థాయికి తగ్గట్టుగా మాట్లాడాలి
- గద్దర్‌ను సాక్షాత్ ప్రధానమంత్రే ప్రశంసించారు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

02

## భట్టి చెప్పింది నిజమా? మీ మాటలు నిజమా?

**రైతుల ఆరాటం చిల్లర పంచాయితా?**

- మీ సెల్ఫ్ డబ్బాకు, మీ సెటైర్లకు కాలం చెల్లింది
- నీలో అటెన్షన్ డిక్రీసింగ్ డిజార్డర్ మొదలైంది
- మంచి మానసిక వైద్యుడిని సంప్రదించు
- సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఆగ్రహం

**హైదరాబాద్, మహా:** సీఎం రేవంత్ రెడ్డి తాజా ప్రెస్‌మీట్ పై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'రేవంత్ ప్రెస్ మీట్ ఎలా ఉందంటే.. పెట్టుబడుల కట్టు కథను నమ్మించేందుకు శత విధాలుగా ప్రయత్నించి అట్టర్ ఫ్లాప్ అయినట్లుగా కనిపిస్తోంది.



మిగతా 3లో



## సీపీఎం కార్యదర్శిగా తొలిసారి దళితుడు

- జాన్ వెస్లీని ఎన్నుకున్న నాయకత్వం
- వయసు రిత్యా తప్పకున్న వీరభద్రం

**సంగారెడ్డి, మహా :** సీపీఎం తెలంగాణా రాష్ట్ర కార్యదర్శిగా జాన్ వెస్లీ ఎన్నికయ్యారు. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన జాన్ వెస్లీని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకుంది. దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. సంగారెడ్డిలో జరిగిన సీపీఎం రాష్ట్ర 4 వ మహాసభల్లో జాన్ వెస్లీని పార్టీ నాయకత్వం కొత్త కార్యదర్శిగా ఎన్నుకుంది. కాగా 70 ఏళ్ళు దాటిన నేతలకు రాష్ట్ర కమిటీ నుంచి ఉద్వాసన పలికినట్లు సమాచారం. వయసు రీత్యా రాష్ట కమిటీ నుంచి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్సీ సీతారాములు, నర్సింగ రావులకు చోటు దక్కలేదని తెలుస్తోంది.

# నిర్మలమ్మ ఏం చేస్తారో!?

### బడ్జెట్‌లో ఊరట కోసం సామాన్యుల ఎదురుచూపులు

**ధరాఘాతంతో బెంబేలెత్తుతున్న ప్రజానీకం**

**ఎదుగూ బొదుగూ లేని ఆదాయం**

**వెంటాడుతున్న నిరుద్యోగం.. పన్నుల భారంతో కుదేలు**




**న్యూఢిల్లీ, మహా :** ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిదో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతుండగా సామాన్య ప్రజలు మాత్రం ఆమె ప్రకటించే 'ఊరట' చర్యల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఆకాశాన్ని తాకుతున్న ఆహార వస్తువులు ముఖ్యంగా కూరగాయల ధరల్ని నేలకు దించాలని వారు కోరుకుంటున్నారు. అరకొర ఆదాయంతో బతుకు బండిని లాగుతున్న కుటుంబాలు ధరాఘాతంతో బాగా ఇబ్బంది పడుతున్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వారి వేతనాలు పెరగడం లేదు. మరోవైపు ఉద్యోగాల కోసం ఆశగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు నిరాశే ఎదురవుతుంది. చాలినన్ని ఉద్యోగాలు అందుబాటులో లేకపోవడమే దీనికి కారణం. గత కొద్ది నెలలుగా పేద, మధ్య తరగతి కుటుంబాలు వినియోగ వస్తువుల కొనుగోలును వాయిదా వేసుకోవడమో లేదా కుదించుకోవడమో చేస్తున్నాయి. ఫలితంగా కార్పొరేట్ సంస్థల ఆదాయం కూడా పడిపోతోంది.

**దిగిరానంటున్న ద్రవ్యోల్బణం**

బడ్జెట్‌లో పరిష్కారం చూపాల్సిన ఐదు కీలక అంశాలపై ఆర్థిక మంత్రి దృష్టి సారించాలని సామాన్యుడు కోరుకుంటున్నాడు. వాటిలో ముఖ్యమైనది ద్రవ్యోల్బణం. కూరగాయలు, వంట నూనెలు, పాల ధరలు పైపైకి ఎగబాకుతుండడంతో వంటింటి అవసరాలు తీరడం లేదు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా కూరగాయల ధరలు బాగా పెరుగుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం సుంకాలు పెంచడంతో వంట నూనెలూ సలసలా కాగిపోతున్నాయి. ఉత్పాదక వ్యయం పెరగడంతో పాలు కూడా ప్రియమయ్యాయి. పాల ధరను లీటరుకు ఒక రూపాయి మేర తగ్గిస్తున్నట్లు అమూల్ సంస్థ ఆదివారం చేసిన ప్రకటన కొంత ఊరట కలిగించేదే. బిస్కట్ల వంటి ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల ధరలు బాగా పెరగడంతో ఇటీవలి కాలంలో కుటుంబ బడ్జెట్ అంచనాలు తప్పుతోంది. ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల్లో పామాయిల్‌ను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఖర్చులు పెరగడంతో ధరలు పెంచక తప్పదని ఇప్పటికే పలు కంపెనీలు హెచ్చరించాయి. దిగుమతి సుంకాన్ని తగ్గిస్తే వంట నూనెల ధరలు కొంతమేర దిగివస్తాయి. కంపెనీల ఉత్పత్తి వ్యయం కూడా తగ్గుతుంది.

**పెరగని జీతాలు, వేతనాలు**

కార్మికులు, జూనియర్ నుండి మధ్య శ్రేణి ఎగ్జిక్యూటివ్‌ల వరకూ వేతనాలు, జీతాల్లో పెరుగుదల నెమ్మదించడంతో వినియోగ వస్తువుల కొనుగోళ్లపై ఖర్చు తగ్గుతోంది. పట్టణ ప్రాంతాల్లో నెలవారీ జీతాలపై కాకుండా రోజువారీ వేతనాలపై ఆధారపడుతున్న వారి ఆదాయం గత 12 నెలల్లో కేవలం 3.4 శాతం మాత్రమే పెరిగిందని, అదే జీతాలు తీసుకునే వారి ఆదాయం 6.5 శాతం పెరిగిందని బ్రిటానియా సంస్థ తెలిపింది. పట్టణ కార్మికుల్లో రోజువారీ వేతనాలపై ఆధారపడే వారే సగం మంది కంటే ఎక్కువగా ఉంటారు. ఇంజినీరింగ్, తయారీ, ప్రాసెస్, మౌలిక సదుపాయాల కంపెనీల్లో పనిచేసే వారి వార్షిక ఆదాయ వృద్ధి రేటు 0.8 శాతం మాత్రమేనని ఫిక్కీ తెలిపింది. వినియోగ వస్తువుల అమ్మకాలు బాగా జరిపే పరిశ్రమల్లో పని చేసే వారి ఆదాయం 201923 మధ్య కేవలం 5.4 శాతం మాత్రమే పెరిగింది.

**నెమ్మదించిన ఆర్థిక వృద్ధి**

దేశాన్ని కుదిపేస్తున్న ఆర్థిక మాంద్యంపై కూడా నిర్మలా సీతారామన్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మన దేశం 6.4 శాతం వృద్ధి రేటు సాధిస్తుందని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై (మూలధనపు వ్యయం) ప్రభుత్వం పెద్దగా ఖర్చు చేయకపోవడం కూడా ఆర్థిక వృద్ధి రేటు తగ్గడానికి కారణమవుతోంది. ప్రభుత్వం మూలధనపు వ్యయంపై నిధులు వెచ్చిస్తే సిమెంట్, స్టీల్, నిర్మాణ యంత్రాలకు డిమాండ్ పెరుగుతుంది. అప్పుడు ఫ్యాక్టరీల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. ఫలితంగా అవి మరిన్ని పెట్టుబడులు పెడతాయి. తయారీ, నిర్మాణ రంగంలో ఉద్యోగాల కల్పన జరుగుతుంది.

**ఉద్యోగాల కల్పనలో వైఫల్యం**

దేశంలో ఉద్యోగ, ఉపాధి కల్పన కూడా నత్తనడక నడుస్తోంది. కోవిడ్ సమయంలో లక్షలాది మంది కార్మికులు తమ గ్రామాలకు వలస వెళ్లి వ్యవసాయ పనులు చేసుకున్నారు. వారంతా నేటికీ తిరిగి పట్టణాలు, నగరాలకు చేరలేదు. పట్టణ ప్రాంతాల్లో జీవన వ్యయం అధికంగా ఉండడం, పని దొరక్కపోవడం దీనికి ప్రధాన కారణం. లేబర్ ఫోర్స్‌లో చేరుతున్న వారికి ప్రభుత్వం సరైన ఉద్యోగాలు చూపలేకపోతోంది. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వ వ్యయాన్ని పెంచడంతో పాటు ప్రైవేటు రంగం కూడా కార్మికులను ప్రోత్సహించే కార్యకలాపాలు చేపడితే పరిస్థితి మెరుగుపడుతుంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మద్దతుగా కేంద్రం మరిన్ని ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం కూడా ఉంది.

**భారంగా మారిన పన్ను పోటు**

స్వల్ప, మధ్య ఆదాయ వర్గాలపై పన్ను పోటు అధికంగా ఉంటోంది. జీఎస్టీ వంటి పరోక్ష పన్నుల విషయంలో ప్రభుత్వం పెద్దగా చేసేదేమీ ఉండదు. ఎందుకంటే వాటిపై కేంద్ర, రాష్ట్ర ఆర్థిక మంత్రులతో కూడిన జీఎస్టీ మండలి నిర్ణయం తీసుకుంటుంది. కానీ వంట నూనెల వంటి అత్యవసరాలపై దిగుమతి సుంకాలను తగ్గించడం, పెట్రోలియం ఉత్పత్తులపై పన్నుల్ని హేతుబద్ధీకరించడం వంటి చర్యల ద్వారా కొంత ఊరట కల్పించవచ్చు. దిగువ, మధ్య తరగతి వారిపై ఆదాయపన్ను భారాన్ని తగ్గించాల్సిన అవసరం కూడా ఉంది. ఈ డిమాండ్ ఎప్పటి నుండో వినిపిస్తోంది. ఆదాయపన్నును తగ్గిస్తే ప్రజల జేబుల్లో మరింత డబ్బు చేరుతుంది. కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ కీలక అంశాలపై దృష్టి సారించి తమకు ఊరట కలిగించే చర్యలు చేపట్టాలని పేద, మధ్య తరగతి ప్రజలు కోరుకుంటున్నారు.



## నగర శివార్లలో ఎక్స్‌పీరియమ్ పార్క్

**ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి**

**హైదరాబాద్, మహా :** నగర శివార్లలో నూతనంగా తీర్చి దిద్దిన ఎక్స్‌పీరియమ్ పార్క్‌ను సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం మెఘాస్టార్ చిరంజీవితో కలిసి ప్రారంభించారు. ప్రొద్దుటూరులో ప్రపంచంలోనే అతిపెద్ద ఎక్స్‌పీరియమ్ పార్క్‌గా తీర్చి దిద్దారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, పలువురు నేతలు, ముఖ్య అధికారులు పాల్గొన్నారు. ప్రకృతి ప్రేమికుల కోసం నగర శివార్లలో నిర్మించిన అతిపెద్ద ఎకో ఫ్రెండ్లీ 'ఎక్స్ పీరియమ్' పార్క్‌గా దీన్ని తయారు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో రామ్‌దేవ్‌రావు 150 ఎకరాలలో ఏర్పాటు చేసిన పార్కులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 25 వేల జాతులకు సంబంధించిన మొక్కలు ఉన్నాయి. అర్జెంటీనా, ఉరుగ్వే, మెక్సికో, సౌత్ అమెరికా, స్పెయిన్, ఇటలీ, న్యూగినియా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మలేషియా తదితర దేశాల నుంచి అరుదైన మొక్కలు, చెట్లు, రకరకాల స్టోన్స్, అందమైన శిలలు సేకరించి గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం సుమారు రూ. 150 కోట్లు ఖర్చు చేశారు. ఒక్కో శిల్పానికి రూ. 5 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఖర్చు చేశారు. 1,500 మంది కూర్చునేలా ఇండియాలోనే అతిపెద్ద హంపీ థియేటర్‌ను కూడా ఈ పార్క్ లో ఏర్పాటు చేశారు. 30 అడుగుల ఎత్తులో 20 స్టెయిన్ లెస్ స్టీల్ శిల్పాలు ఏర్పాటు చేసి వాటిని ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. రూ. 50 కోట్లతో 12 ఎకరాలలో మ్యాన్‌మేడ్ బీచ్ ఏర్పాటు చేశారు. 40 గదులు, 20 కాటేజీలతో సుందరమైన సహజ రిసార్టు ద్వీపంగా తీర్చిదిద్దారు. ఫ్రీ వెడ్డింగ్, పోస్టు వెడ్డింగ్, ఫొటో షూట్‌లకు ఎక్స్‌పీరియంను రామ్‌దేవ్‌రావు ఎంతో శ్రమకోర్చి ఏర్పాటు చేశారు. దేశానికి గర్వకారణంగా, రాష్ట్రప్రతిష్టకు చిహ్నంగా, హైదరాబాద్‌కు ఐకానిక్‌గా ఎక్స్‌పీరియం ఉంటుందని ఈ సందర్భంగా వచ్చిన అతిథులు అభిప్రాయపడ్డారు.

## హుస్సేన్ సాగర్ అగ్నిప్రమాద ఘటన

**రెండుకు చేరిన మృతుల సంఖ్య**

**చికిత్స పొందుతూ ఒకరు మృతి..నీటిలో లభించిన అజయ్ మృతదేహం**

**45 గంటలు గాలించి శవాన్ని కనుగొన్న డీఆర్ఎఫ్ సిబ్బంది**



**హైదరాబాద్, మహా :** హుస్సేన్ సాగర్ అగ్నిప్రమాద ఘటన విషాదాన్ని నింపింది. నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా గ్రౌండ్స్‌లో ఆదివారం భారత మాతకు మహా హారతి కార్యక్రమం నిర్వహించగా బోట్‌లో క్రాకర్స్ పేలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన గణపతి అనే వ్యక్తి సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మంటలంటుకోవడంతో భయపడి నీటిలో దూకి గల్లంతైన అజయ్ మృత దేహాన్ని డీఆర్ఎఫ్ సిబ్బంది గుర్తించి వెలికి తీశారు. దీంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. గణపతి స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లాగా గుర్తించారు. ఈ ఘటనలో మరో ఇద్దరు కూడా గాయపడగా ప్రస్తుతం వారికి చికిత్స అందుతోంది.

**ఆ రోజు ఏం జరిగిందంటే**

రిపబ్లిక్ డే రోజున భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజా గ్రౌండ్స్‌లో భారతమాతకు హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం వారు వెళ్లిన కాసేపటికే ప్రమాదం చోటు చేసుకుంది. నిర్వాహకులు క్రాకర్స్ పేల్చేందుకు బాణసంచాను రెండు బోట్లలో సిద్ధం చేశారు. అయితే ప్రమాదవశాత్తు బోట్లలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో గణపతి సహా మరికొందరు గాయపడ్డారు. బాధితులను యశోద, గాంధీ, సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రులకు తరలించారు. వీరులో గణపతితో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారు డిశ్చార్జ్ అయ్యారు. గణపతి పరిస్థితి విషమించి మంగళవారం ప్రాణాలు కోల్పోయాడు.

ఇక వైజాగ్ నగరానికి చెందిన మణికంఠ క్రాకర్స్ ఈవెంట్ బాధ్యతలు తీసుకున్నాడు. హైదరాబాద్ నగరానికి చెందిన రాఘవేందర్ అనే యువకుడు మణికంఠకు క్రాకర్స్ సరఫరా చేశాడు. ఆ క్రాకర్స్ నగదు తీసుకోవటానికి తన ఫ్రెండ్స్‌అజయ్, సాయి సందీప్‌లతో నెక్లెస్ రోడ్డుకు వెళ్లాడు. మణికంఠ నుంచి డబ్బులు తీసుకున్న తర్వాత బోట్ లో హుస్సేన్ సాగర్ లోకి వెళ్లారు. ప్రమాదం సమయంలో రెండు బోట్లలో కలిపి మొత్తం 15 మంది ఉన్నారు. ప్రమాదవశాత్తు ఒక్కసారిగా కాక్రర్స్ పేలటంతో చాలా మంది నీళ్లలోకి దూకి ఒడ్డుకు చేరుకున్నారు. వీరిలో అజయ్ అనే యువకుడు మాత్రం ఒడ్డుకు చేరుకోలేదు. దీంతో అతడి కోసం సాగర్‌లో గాలింపు చర్యలు చేపట్టగా దాదాపు 45 గంటల తర్వాత అజయ్ మృత దేహం లభించింది. గల్లంతైన అజయ్ కోసం డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఫైర్, టూరిజం మొత్తం నాలుగు బృందాలు గాలింపులో పాల్గొన్నాయి.



## గద్దర్ పై బండి వ్యాఖ్యలను ఖండిస్తున్నా

- స్థాయికి తగ్గట్టుగా మాట్లాడాలి
- గద్దర్ ను సాక్షాత్ ప్రధానే ప్రశంసించారు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, మహా:** గద్దర్ పై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు పీసీసి చీప్ మహేశ్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. 'గద్దర్ పై కేంద్ర మంత్రి బండి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ఉనికి కోసం బండి సంజయ్ దిగజారి మాట్లాడుతున్నారు. లెఫ్ట్ భావజాలం గురించి మాట్లాడుతున్నారు. ఎంతోమంది కర సేవకులను కాల్చి చంపిన వాళ్లకు అవార్డు ఇచ్చారు. అటువంటి భావజాలం ఉన్న వాళ్ళని మీ పార్టీలో ఎంతమందిని చేర్చుకోలేదు..? గద్దర్ త్యాగం మర్చిపోయి కించపరిచే విధంగా మాట్లాడుతున్నారు. బండి సంజయ్ స్థాయికి తగ్గట్టు మాట్లాడాలి. పద్మా అవార్డులు కూడా పార్టీ రంగును పులువుతున్నారు. మీ వల్ల వాటి విలువ కూడా తగ్గుతుంది. గద్దర్ ని కించపరచడం అనేది ప్రతి ఒక్క ఉద్యమకారుడిని కించపరిచినట్లే. మీరు అవార్డు ఇచ్చినా ఇయ్యకపోయినా గద్దర్ ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోతారు. సాక్షాత్ ప్రధానమంత్రి గద్దర్ ను ప్రశంసించిన సందర్భాన్ని బండి సంజయ్ మరిచిపోయారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గద్దర్ పాడిన పాటతో తెలంగాణ వచ్చిందని బీజేపీ నాయకులు మాట్లాడారు' అని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు.

## మహా కుంభ మేళాకు భోజనానికి ఏం సంబంధం

**ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే వ్యాఖ్యలపై రాజాసింగ్ కస్సు**

**బుద్ధిలేని అధ్యక్షుడని ప్రజలు నవ్వుతున్నారు**

**కుంభమేళాలో పుణ్య స్నానమాచరించిన బీజేపీ ఎమ్మెల్యే**

**హైదరాబాద్, మహా :** ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు విశేష స్పందన వస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న భక్తులే కాదు ప్రపంచ నలు మూలల నుంచి కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించేందుకు తరలివస్తున్నారు. అఘోరాలు, స్వామిజీలతో పాటు కోట్లలో సాధారణ ప్రజలు కుంభమేళాకు వస్తున్నారు. ఈ క్రమంలోనే పలువురు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు కూడా కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. మంగళవారం గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా కుంభమేళాలలో పాల్గొన్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. ఈ సందర్భంగా రాజాసింగ్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తీర్థరాజ్ ప్రయాగ్‌లోని త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించటం తనకు అద్భుతమైన ఆధ్యాత్మిక అనుభవాన్ని ఇచ్చిందని, తన మనస్సును, ఆత్మను కొత్త చైతన్యంతో నింపిందని రాజాసింగ్ తెలిపారు. గంగామాత స్వచ్ఛమైన ప్రవాహం భారత సాంస్కృతిక, సంప్రదాయాలకు ప్రతీకగా అభివర్ణించారు. మహా కుంభమేళా లాంటి దివ్యమైన కార్యక్రమం భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని సజీవంగా ఉంచుతుందన్నారు. అందరూ ఈ శుభ సందర్భంలో భాగమై ఈ అపూర్వమైన ఆధ్యాత్మిక అనుభూతిని పొందాల్సిందిగా తెలిపారు. మరోవైపు కుంభమేళాపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై రాజాసింగ్ తీవ్రంగా స్పందించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కుంభమేళాకు



చేసిన ఏర్పాట్లు చాలా బాగున్నాయని అభిప్రాయపడ్డారు. ఒకవైపు కోట్లలో భక్తులు వచ్చి ఇక్కడ పుణ్యస్నానాలు చేస్తుంటే కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మాత్రం వ్యతిరేకంగా కామెంట్స్ చేస్తున్నారని మండిపడ్డారు. స్నానం చేస్తే భోజనం వస్తుందా..? అని మాట్లాడుతున్నారని గుర్తు చేసిన రాజాసింగ్ మహా కుంభమేళాకు భోజనానికి సంబంధమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్, సోనియా, చేతకాని కాంగ్రెస్ ప్రతి విషయం రాజకీయం చేస్తోందన్నారు. కాంగ్రెస్ దగ్గర మాట్లాడడానికి వేరే విషయం లేక కుంభమేళాపై కామెంట్స్ చేస్తున్నారని ప్రజలు నవ్వుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి లేని అధ్యక్షుడు వచ్చాడని కూడా ప్రజలు నవ్వుతున్నారని తీవ్ర విమర్శలు చేశారు. హిందూ మనోభావాలు దెబ్బతీసే మాటలు మాట్లాడొద్దని, లేదంటే ఎక్కడా కూడా కాంగ్రెస్ ఉండదని హెచ్చరించారు. కుంభమేళాపై ఖర్గే చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు.

## కొమురవెల్లిలో అఘోరి వీరంగం

**బట్టలేసుకొమ్మన్నందుకు కత్తితో హింసాకాండ.. పలువురికి గాయాలు**

**హైదరాబాద్, మహా :** ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న అఘోరాలు, నాగసాధువులంతా ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరిస్తూ దైవ చింతనలో మునిగి తేలుతుంటే తెలంగాణకు చెందిన ఓ అఘోరి మాత్రం దిగంబరావతారంలో తెలంగాణలో చక్కర్లు కొడుతోంది. అప్పుడప్పుడు కొన్ని దేవస్థానాలకు వెళ్లి అక్కడ కాస్త హల్చల్ చేస్తూ వార్తల్లో నిలుస్తోంది. అయితే తెలంగాణ అఘోరి మాతకు కోపం వచ్చింది. దింగబరావతారంలో వీరంగం సృష్టించిన ఆ అఘోరి మాత కోపంతో ఊగిపోతూ కత్తి తీసి హింసాకాండకు దిగింది. సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న ఆలయానికి మంగళవారం విచ్చేసిన అఘోరి మాత తనను ఆలయ ప్రధాన ద్వారం నుంచి దర్శనానికి అనుమతించాలంటూ హల్చల్ చేసింది. అయితే వస్త్ర ధారణతో వస్తేనే దర్శనానికి అనుమతినిస్తామంటూ ఆలయ అధికారులు ఆమెకు సూచించారు. అక్కడే అఘోరీ మాతకు కోపం వచ్చింది. ఆమె గురించి తెలిసి కూడా మల్లన్న ఆలయ అధికారులు, సిబ్బంది.. బట్టలేసుకొమ్మని చెప్తే ఆమెకు కోపం రాదా మరి. అచ్చంగా అదే జరిగింది. పూర్తి దిగంబరావతారంలో ఆలయానికి వచ్చిన తనను ఇలాగే దర్శనానికి అనుమతించాలంటూ ఆలయ అధికారులతో వాగ్వాదానికి దిగింది. అలా అస్సలు కుదరదని అక్కడి పోలీసు సిబ్బంది, అధికారులు స్పష్టం చేయటంతో అఘోరీ మాత కోపంతో ఊగిపోతూ తనతో తెచ్చుకున్న కత్తితో అక్కడున్న వారిపై ఆకస్మికంగా దాడి



చేసింది. అఘోరీ దాడిలో పలువురికి గాయాలయ్యాయి. ప్రస్తుతం కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. కాగా అఘోరీ మాత హింసాకాండతో అక్కడి భక్తులు ఒక్కసారిగా ఆందోళకు గురయ్యారు. అయితే ముందునుంచి కూడా అఘోరీ మాతకు ఏం చెప్పినా సరే ఇంకేమి అడిగినా సరే వింటుంది చెప్తుంది ఏమాత్రం కోపగించుకోదు. కానీ బట్టలేసుకొమని చెప్తే మాత్రం ఎక్కడ లేని కోపంతో ఊగిపోతుంది అందేంటో మరి. ప్రయాగ రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు ఎక్కడెక్కడి నుంచి లక్షల్లో వస్తున్న అఘోరాల్లో చాలా వరకు కాషాయవస్త్రాలు ధరించే కనిపిస్తున్నారు. బహుశా అక్కడక్కడ కొంతమంది దిగంబరులు కనిపిస్తున్నారేమో కానీ.. చాలా వరకు కాషాయం ధరించే జనాల్లోకి వస్తుంటారు. కానీ తెలంగాణ అఘోరీ మాత్రం ఇలా సింగిల్‌గా ఊళ్లల్లో తిరుగుతూ దిగంబర దర్శనమిస్తూ భక్తులకు మోక్షం కల్పించే కాన్సెప్ట్ ఏంటో జనాలకు ఇప్పటికీ అర్థం కావట్లేదు.

## స్కూళ్లలో మధ్యాహ్న భోజనం మరింత నాణ్యంగా

**ధరలు 50 శాతం పెంచండి**

- విద్యా కమిషన్ కీలక సూచనలు
- రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్ళు, హాస్టళ్ళను పరిశీలించిన అకునూరి మురళీ

**హైదరాబాద్, మహా :** ఇటీవల ప్రభుత్వ స్కూల్స్, హాస్టల్స్, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలో కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు, నాణ్యతలేని భోజనం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఓ విద్యార్థి ప్రాణం కూడా కోల్పోయింది. తెలంగాణ హైకోర్టు సైతం ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకంపై విద్యా కమిషన్ కీలక సూచనలు చేసింది. మధ్యాహ్న



భోజన ధరలను 50 శాతం పెంచాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దాంతో పిల్లలకు నాణ్యమైన భోజనం అందుతుందని పేర్కొంది. గవర్నమెంట్ స్కూల్స్, గురుకులాల్లో ఆహార నాణ్యత, భద్రత, మౌలిక వసతులు, శానిటరీకి సంబంధించిన లోటుపాట్లను పరిశీలించిన మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళీ నేతృత్వంలోని తెలంగాణ విద్యా కమిషన్ తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఇటీవల కాలంలో ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగు చూసిన తరుణంలో ఛైర్మన్ మురళి, కమిషన్ సభ్యులు రాష్ట్రవ్యాప్తంగా పలు స్కూల్స్, గురుకులాలు, కేజీబీవీలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. వివిధ వర్గాలతో చర్చించి పలు సూచనలతో నివేదికను రూపొందించారు. ప్రస్తుతం వంట ఏజెన్సీ మహిళలకు చెల్లిస్తున్న ధరలు గిట్టుబాటు కావడం లేదని గుర్తించారు. దాని కారణంగానే విద్యార్థులకు నాసిరకం భోజనాన్ని పెడుతున్నారని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. ఏజెన్సీలకు నెలకు ఒకసారి కాకుండా వారం వారం ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించాలని ప్రతిపాదించింది. గురుకుల స్కూళ్లల్లో సరుకులు, కాస్మోటిక్స్, స్టూడెంట్ కిట్లు తదితరాల సేకరణకు టీజీఈడబ్ల్యూఐడీసీను ఏజెన్సీగా చేయాలని సూచించింది. తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలని చెప్పింది. అన్ని గురుకులాలు, పాఠశాలల్లో పథకం అమలుకు ప్రామాణిక నిబంధనలు ఉండాలని నివేదికలో పేర్కొంది. కామన్ మెనూ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వంట సహా తాగేందుకు బోర్ నీళ్లకు బదులు మిషన్ భగీరథ నల్లా నీళ్లు వాడాలని.. భోజనాన్ని కట్టెల పొయ్యిలపై కాకుండా గ్యాస్‌పై వండించాలని సూచించింది. ఈ నివేదికపై కేబినెట్‌లో చర్చించి నాణ్యమైన భోజనం కోసం ధరలను పెంచనున్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఫ్రీ

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో ఏటేటా నిర్మాణాలు పెరుగుతున్నా ఇసుక నుంచి ప్రభుత్వానికి ఆదాయం ఆశించినంత రావడం లేదని, అదే సమయంలో వినియోగదారులు ఎక్కువ ధరకే ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తోందని సీఎం అన్నారు. వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక దక్కేలా చూడాలని, అదే సమయంలో ప్రభుత్వానికి ఆదాయం పెరిగేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇసుక మాఫియాను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. మేజర్, మైనర్ ఖనిజాల గనులకు వేసిన జరిమానాలు వసూళ్లు కాకపోవడంపైనా అధికారులను సీఎం ప్రశ్నించారు. మేజర్, మైనర్ ఖనిజ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేసి రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని అధ్యయన కమిటీని సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్ పాల్గొన్నారు.

# అమెరికా పౌరులకు ట్రంప్ వరాలు

**మహా, స్పెషల్ డెస్క్:** సంచలన నిర్ణయాలతో ప్రపంచాన్ని షేక్ చేస్తున్న ట్రంప్ అమెరికన్లకు మాత్రం వరాలు ఇచ్చేస్తున్నాడు. ఇపుడు మరో సంచలన ప్రతిపాదన తెరమీదకు తీసుకొచ్చారు. అమెరికా పౌరులకు ఆదాయపు పన్ను నుంచి విముక్తి కల్పించేలా ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదనలు చేశారు. ప్రజలు స్వేచ్ఛగా ఖర్చు చేసి ఆర్థిక వ్యవస్థలోకి నిధుల ప్రవాహాన్ని పెంచేందుకే ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలను ధనవంతులు చేసే వ్యవస్థ పనరుద్ధరణ దిశగా ఈ చర్య ఉపయోగ పడుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వానికి లభించే ఆదాయంలో ఇన్‌కమ్ ట్యాక్స్ నుంచి వచ్చే మొత్తం చెప్పుకోదగ్గ స్థాయిలోఉంది. ట్రంప్ నిర్ణయంతో ఆ మేరకు కోతపడితే.. దానిని భర్తీ చేసుకొనేందుకు దిగుమతి సుంకాలను వాడుకోవాలన్నది ప్రణాళికగా చెబుతున్నారు. ''అమెరికన్లను ధనవంతులు, మరింత శక్తిమంతులుగా చేసే వ్యవస్థలోకి మనం వెళుతున్నాం. ఇతర దేశాలను సుసంపన్నం చేసేందుకు మన వారిపై పన్నులు వేసే బదులు.. మనమే విదేశాలపై పన్నులు విధించి అమెరికన్లను సంపన్నులు చేయాలి. వీటిని వసూలు చేసేందుకు ఎక్స్‌టర్నల్ రెవెన్యూ సర్వీసును ప్రారంభించాను'' అని రిపబ్లికన్ సభ్యుల సమావేశంలో వ్యాఖ్యానించారు. అమెరికా చరిత్రలోనే 1870 నుంచి 1913 మధ్య ప్రజలు అత్యధిక సంపదతో తులతూగారని ట్రంప్ పేర్కొన్నారు. నాడు సుంకాల ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఉండేదని చెప్పారు. అప్పట్లో దిగుమతి సుంకాల నుంచి ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయం లభించేదన్నారు. అమెరికా తక్షణమే తన వాణిజ్య వ్యవస్థను మార్చుకోవాలన్నారు. అమెరికా ఉద్యోగులు, కుటుంబాలను రక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## భారత్‌కు షాక్

భారత్, చైనా, బ్రెజిల్‌పై అత్యధిక పన్నులు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. "బయట దేశాలు ఏం చేస్తున్నాయో చూడండి. చైనా భారీగా పన్నులు వసూలు చేస్తుంది. ఇక భారత్, బ్రెజిల్, ఇతర దేశాలు కూడా ఆ పద్ధతినే అనుసరిస్తున్నాయి. మనం అలా జరగనీయకూడదు. అమెరికా ప్రయోజనాలు అన్నింటికంటే ముందుండాలి" అని పేర్కొన్నారు. వాస్తవానికి ట్రంప్ గత డిసెంబర్‌లోనే బ్రిక్స్ దేశాలు ప్రత్యేక కరెన్సీ తీసుకొస్తే 100శాతం సుంకం విధిస్తామని హెచ్చరించారు. డాలర్ వినియోగం నిలిపేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.




# భట్టి చెప్పింది నిజమా? మీ మాటలు నిజమా?



(మొదటిపేజీ తరువాయి)

మీ ప్రెస్ రిలీజులు, మీ మీడియా కవరేజులు, మీ ఈనో స్టోరీలు ఎవరూ నమ్మడం లేదని సీఎం రేవంత్ రెడ్డికి అర్థమైంది. ఎప్పుడో అయిపోయిన దావోస్‌కు ఇప్పుడు ఎందుకు ఈ దావతు. దావోస్‌లో జరిగే ఎంవోయూలు అన్నీ కూడా ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ మాత్రమే, ఎవరైనా ఓపెన్ టెండర్‌లో రావాల్సిందే.. అని ఆర్థిక మంత్రి భట్టి గారు అంటే, మీరేమో రూ. లక్షా 82 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చినట్లుగా గప్పాల మీద గప్పాలు కొడుతున్నారు. భట్టి గారు చెప్పింది నిజమా? మీ మాటలు నిజమా? రేవంత్ రెడ్డి. పొంతన లేకుండా మీరు చెప్పిన కంపెనీలు, పెట్టుబడుల లెక్కలు యావత్ తెలంగాణ ప్రజానీకం గమనించింది. అంతా డొల్ల ప్రచారం అని తేటతెల్లమైంది. రైతు భరోసా కోసం గంపెడు ఆశతో, కొండంత ఆందోళనతో ఎదురుచూస్తున్న రైతుల ఆరాటాన్ని చిల్లర పంచాయితీ అంటవా? ఇంతకు ముందు రైతు బంధును బిచ్చం అన్నవు, ఇప్పుడు రైతు భరోసాను చిల్లర పంచాయతీ అంటున్నవు. సంక్రాంతికి ఇస్తానన్నావ్.. ఇయ్యలేదు. ఇప్పుడు మార్చి 31 దాకా గడువు పెంచారు. జర్నలిస్టులు ఇదేంటని అడిగితే, చిల్లర పంచాయితీ అంటున్నావు. అప్పుల పాలవుతున్న రైతుల ఆవేదనను పక్కన పెట్టి మీ ప్రచారం వినాల్నా..? రైతుల అప్పులు ముఖ్యమా.? దావోస్ డప్పులు ముఖ్యమా..? మీ సెల్ఫ్ డబ్బాకు, మీ వెకిలి సెటైర్లకు కాలం చెల్లింది. ఇకనైనా కళ్లు తెరువు సీఎం రేవంత్ రెడ్డి. నీలో అటెన్షన్ డిక్రీసింగ్ డిజార్డర్ మొదలైంది. నీ మాటలు ఎవరు నమ్మడం లేదనే ఆందోళన నీలో పెరిగిపోయింది. మంచి మానసిక వైద్యుడిని సంప్రదించడం మంచిది' అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సలహా ఇచ్చారు.

# చంద్రబాబుది బ్రాడ్ మైండ్

(మొదటిపేజీ తరువాయి)

ఆయన చాలా బ్రాడ్ థింకింగ్‌తో ఉన్నారని చెప్పారు. అంతేకాదు పక్కనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అపార వనరులు ఉన్నాయని, కోస్టల్ ఏరియా సైతం ఉందని తెలిపారు. ఆ ఏరియాలో మంచి పరిశ్రమలు వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు పరిశ్రమలతో వారు అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ)లు చేసుకున్నారని వివరించారు. అయితే ఏపీ ప్రభుత్వంతో చేసుకున్న అవగాహన ఒప్పందాలు దావోస్‌లో ఎందుకు ప్రకటించలేదని ఆ రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను తాను ప్రశ్నించానని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు గుర్తు చేసుకున్నారు. తాము ఆంధ్రప్రదేశ్‌లోనే చెబుతామని నారా లోకేష్ నుంచి సమాధానం వచ్చిందన్నారు.

ఈ నేపథ్యంలో వారు పెట్టుబడుల వ్యవహారంలో కచ్చితమైన వ్యూహంతో ఉన్నారనే విషయం తనకు పూర్తిగా అర్థమైందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అనుకూలతలు ..పెట్టుబడులు పెట్టించేందుకు చంద్రబాబు నాయుడు ప్రయత్నాలు అల్టిమేట్ అని అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రయత్నాలన్నీ సఫలం అయితే భవిష్యత్తులో తమని కంపేర్ చేసేటప్పుడు తక్కువ చేసి చూపించే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌ను డిస్టర్బ్ చేసే మూడ్‌లో సీఎం చంద్రబాబు లేరని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు కుండ బద్దలు కొట్టారు. అదీకాక ఆయన మాటలు చాలా పెద్దరికంగా ఉన్నాయన్నారు. హైదరాబాద్ కంపెనీలు ఏపికి రావాలి, ఇక్కడ డిస్టర్బ్ చేయాలనే ఆలోచన ఆయనకు అస్సలు లేదు, హైదరబాద్ ఇంకా అభివృద్ధి కావాలని ఆయన కోరుకుంటున్నారన్నారు. దావోస్‌లో మైనస్ 8 నుంచి 11 వరకు ఉష్ణోగ్రత ఉందని, తామంతా స్వెటర్స్ వేసుకున్నాం కానీ చంద్రబాబు నాయుడు మాత్రం రెగ్యులర్ డ్రెస్‌లో ఉన్నారన్నారు. చంద్రబాబు చాలా ఫిట్‌గా ఉన్నారని, ఆయన ఆ ఏజ్‌లో సైతం చాలా యాక్టీవ్‌గా ఉండడం గ్రేట్ అని అభివర్ణించారు.

# హైదరాబాద్‌లో మరో రెండు ఐటీ పార్కులు

**ఏర్పాటు ఎక్కడా అని పరిశీలిస్తున్నాం.. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు**

**రూ.100 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన 'డ్యూ'**

**సచివాలయంలో కంపెనీ ప్రతినిధులతో శ్రీధర్ బాబు సమావేశం**

**హైదరాబాద్, మహా :** హైటెక్ సిటీ తరహాలో మరో రెండు ఐటీ పార్కులను హైదరాబాద్ లో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సచివాలయంలో 'డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కంపెనీ రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఐటీ రంగంలో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రముఖ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని అన్నారు. హైటెక్ సిటీ తరహాలో ఏర్పాటు చేయనున్న రెండు ఐటీ పార్కులను ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలి? నగర శివార్లలో ఏయే



ప్రాంతాలు ఇందుకు అనుకూలంగా ఉన్నాయి? అనే అంశాలపై అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. ఐటీ పార్కుల్లో పనిచేసే వారికి అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చూస్తామన్నారు. ఈ ఐటీ పార్కులకు ఎక్కడి నుంచైనా చేరుకోవడానికి అనుకూలంగా ఏర్పాట్లు చేస్తామని అన్నారు.

# ట్రిలియన్ ఎకానమీ పక్కా

**దావోస్ పర్యటనతో ఖరారు.. పెట్టుబడులతో స్వర్గధామంగా తెలంగాణ**

**నిరుద్యోగ యువతకు భారీగా ఉద్యోగాలు**

**రాష్ట్రాన్ని బద్నాం చేసేందుకు కుట్ర : సీఎం రేవంత్ రెడ్డి**

**పోటీ ఇతర రాష్ట్రాలతో కాదు ప్రపంచ దేశాలతో : మంత్రి శ్రీధర్ బాబు**




**హైదరాబాద్, మహా:** తమ ప్రభుత్వం సాధించిన విజయాల్లో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్ద విజయమని సీఎం రేవంత్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం సచివాయలంలో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'దావోస్ సదస్సు ద్వారా దాదాపు రూ.1.80లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. ప్రభుత్వంపై కొందరు చేసిన దుష్ప్రచారం పటాపంచలు అయ్యింది. ప్రభుత్వంపై, రాష్ట్రంపై నమ్మకం ఉంచుతూ భారీ పెట్టుబడులకు చాలామంది ముందుకు వచ్చారు. ఈ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచుతూ అంతర్జాతీయ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. పీవీ సరళీకృత విధానాలు అమలు చేయడం ద్వారా ప్రపంచానికి నమ్మకం కలిగి పెట్టుబడులు వస్తున్నాయి. రాజకీయాలకు తావు లేకుండా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నుండి నేటి వరకు హైదరాబాద్ అభివృద్ధి జరిగింది. ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా పనిచేస్తున్నాం. సింగపూర్ ప్రభుత్వం తో టెక్నాలజీ ఐటీఈపై శిక్షణ ఒప్పందం చేసుకున్నాం. దీంతో నిరుద్యోగ యువతకు ఉపాధి దొరకనుంది. రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందనుంది' అంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. 'రాష్ట్ర ప్రభుత్వంపై, ప్రభుత్వ విధానాలపై, ముఖ్యమంత్రి, మంత్రులపై నమ్మకంతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. స్థిరమైన కాంగ్రెస్ ప్రభుత్వం పై నమ్మకం తో గత సంవత్సరం 40 వేలకు పైగా ఒప్పందాలు. ఇన్వెస్టర్ లకు నమ్మకాన్ని కలిగించాంగలిగాం. ఈ సంవత్సరం 1,79000కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాం. గతేడాది దావోస్ సదస్సులో రాష్ట్రానికి రూ. 40 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది స్థిరమైన, వ్యాపార అనుకూలమైన ప్రభుత్వం అని వ్యాపారులు నమ్ముతున్నారు. అందుకే ఈసారి నాలుగు రెట్లు అధికంగా ఒప్పందాలు జరిగాయి. దావోస్ ఒప్పందాల పెట్టుబడులతో కొత్తగా 49,500 ఉద్యోగాలు వస్తాయి. స్విడ్జర్లండ్ లో ఒప్పందాలతో కలిపి 51,400 ఉద్యోగాలు వస్తాయి. మూసీ నదిని ప్రక్షాళన చేసి నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అదిస్తాం. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా సద్విమర్శలుగా తీసుకోవాలనుకున్నాం. మన పోటీ ఇతర రాష్ట్రాలతో కాదు ప్రపంచ దేశాలతో ఉండాలన్నది ముఖ్యమంత్రి, మా ప్రభుత్వ లక్ష్యం' అంటూ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# గద్దరే అవార్డైన వేళ..

**హైదరాబాద్, మహా:** గద్దరే అవార్డుగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కానీ గద్దర్ కు అవార్డు ఎట్ల ఇస్తం.. ఇయ్యం. ఆయన పేరుమీద ఇచ్చే అవార్డులు కూడా తీసుకోం అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో సెగలు పుట్టిస్తున్నాయి. తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడిగా ఈటల రాబోతున్నాడనీ, తన ప్రాధాన్యత తగ్గిపోతుందని సంజయ్ ఫ్రస్టేషన్లో మాట్లాడుతున్నాడని పిసిసి అధికారప్రతినిధి రవళిరెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ సరితా తిరుపతయ్య మండిపడ్డారు. పద్మ అవార్డు గద్దర్ కి అలంకారం కాదని, పద్మ అవార్డుకే గద్దర్ అలంకారమన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు గద్దర్ పాట వినిపిస్తుందన్నారు. మెడ మీద తలకాయ ఉన్నోళ్లు ఎవ్వరు బండి సంజయ్ లాగా మాట్లాడరన్నారు.

కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు పీసీసి చీఫ్ మహేశ్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. పద్మా అవార్డులు కూడా పార్టీ రంగును పులపడం దారుణమన్నారు. గద్దర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే వెనక్కి తీసుకుని, వారి కుటుంబసభ్యులకు, యావత్ తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఏఐసీసీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ డాక్టర్ కేతూరి వెంకటేష్ డిమాండ్ చేశారు. మరోవైపు మంద కృష్ణ మాదిగ గద్దర్ కంటే 100 రెట్లు గొప్పఅని బిజెపి అధికారప్రతినిధి రాణిరుద్రమ అన్నారు. గద్దర్ పోరాటం వల్ల, ఆయన భావజాలం వల్ల వందలాది మంది పోలీసులు, వ్యక్తులు చనిపోయారన్నారు. మంద కృష్ణకు అవార్డు ఇచ్చినందుకు తెలంగాణ సమాజం అభినందించాలన్నారు. వర్గీకరణ వేళ బండి సంజయ్ తో బిజెపి వ్యూహాత్మకంగా వ్యాఖ్యలు చేయించిందా? ఆవేశంలో అన్నారా? అన్న చర్చలు కూడా సాగుతున్నాయి.



# మీ రాజకీయాలు అందరికీ అర్థమయ్యాయి

**మహా:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న నేపథ్యంలో ఢిల్లీలోని ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్ర స్థాయిలో కొనసాగుతోంది. తాజాగా మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కేజ్రీవాల్ తనకు తోచిన విషయాన్ని మాట్లాడుతూ ఉంటారు. ఆదిలో ఢిల్లీలో అవినీతి రహిత రాజకీయాలు చేస్తానని చెప్పారు. దేశ రాజధానిలో మార్పులు చూపిస్తానని అన్నారు. కానీ, పేదలు కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రం కనిపించకుండా పోతారు. ఢిల్లీలో హింస జరిగే సమయంలో మాయమయ్యారు. ఆయనకు కొత్తలో చిన్న కారు మాత్రమే ఉండేది. కానీ, తర్వాత శీష్ మహల్ (అద్దాల మేడ)లో నివసించారు. అవినీతి రహిత రాజకీయాలు చేస్తానని చెప్పిన కేజ్రీవాల్ ఢిల్లీలో భారీ కుంభకోణమే చేశారు. ఆప్ నేత మనీశ్ సిసోడియా జైలు జీవితం గడిపారు. ప్రస్తుతం తమ పదవుల నుంచి తప్పుకున్నారు. వారి రాజకీయాలు అందరికీ అర్థమయ్యాయి' అని అన్నారు.

# ఎరువుల పంపిణీలో రైతులకు ఇబ్బంది తలెత్తవద్దు

**గోదాముల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి**

**సంస్థ స్థలాలలో కొత్త గోదాముల నిర్మాణం చేపట్టాలి**

**గోదాములపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో రైతుల సాగుకు కావాల్సిన ఎరువుల నిల్వలు ఉన్నాయని, ఎరువుల పంపిణీలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 83075 మెట్రిక్ టన్నుల సోయాబీన్‌ను 42 కేంద్రాల ద్వారా 48133 మంది రైతుల నుండి సేకరించడం జరిగిందని, 990 మెట్రిక్ టన్నులు పెసళ్లను 14 కేంద్రాల ద్వారా 1607 మంది రైతుల నుండి సేకరించడం జరిగిందని తెలిపారు. అలాగే ప్రస్తుతం Nనాఫెడ్, ఎన్ సీసీఎఫ్ కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా రాష్ట్రంలో కందుల కొనుగోలు చేపట్టాడం జరిగిందని వివరించారు. మార్క్‌ఫెడ్ ద్వారా 903 ప్రాథమిక సహకార సంఘాలు 416 ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలు 55 హాకా సేవాకేంద్రాల ద్వారా రైతులకు ఎరువుల సరఫరా నిరంతరంగా జరుగుతుందని తెలియజేశారు. ప్రణాళికబద్ధంగా కొనుగోళ్ళను చేపట్టడంతో పాటు రైతాంగానికి కావాల్సిన ఎరువుల



విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిమాండుకు అనుగుణంగా ఎరువుల నిల్వలు ఉన్నాయని, పంపిణీలో జాగ్రత్త వహించాలన్నారు. మార్క్ ఫెడ్ వివిధ జిల్లాలలో 76 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించి, ప్రస్తుతం 21 కేంద్రాలు ప్రారంభించడం జరిగిందంటూ రైతులు ప్రభుత్వం అందిస్తున్న మద్ధతు ధర రూ. 7550 కి తమ కందిపంటను అమ్ముకోవాలని కోరారు. మార్క్ ఫెడ్ ద్వారా 79,000 మెట్రిక్ టన్నుల సామార్థ్యంతో గోదాముల నిర్మాణము జరిగిందని, వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. అలాగే అవసరమైన చోట గోదాములపై సౌరవిద్యుత్ ఉత్పత్తి ఏర్పాటుకై తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతుల శ్రేయస్సు కోసం ఎరువుల సరఫరా మరియు అన్ని రకాల పంటల కొనుగోళ్లు కొరకై అవసరమైన అన్ని చర్యలు ముందస్తుగానే తీసుకోవాల్సింది గా ఆదేశించారు. సంస్థ, రైతుల సంక్షేమం కోసం చేపట్టే పనులకు ప్రభుత్వం మద్ధతు అందిస్తుందని తెలియజేశారు. రైతాంగ వృద్ధికి పాటుపడే ఎఫ్ పీడీలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలియజేశారు. హాకా ఎండీ చంద్రశేఖర్ రెడ్డి ఈ ఏడాది సంస్థ తరపున చేపట్టిన కార్యక్రమాలు వివరించగా, తమ కార్యకలాపాల పరిధిని పెంచాలని, వ్యవసాయశాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలకు సంస్థ తరపున తోడ్పాటు అందించాల్సిందిగా మంత్రి ఆదేశించారు. అవసరమైతే కొత్తగా సిబ్బందిని తీసుకొని, రైతాంగం సంక్షేమంలో భాగస్వాములు కావాలని సూచించారు. రెండు ప్రభుత్వరంగ సంస్థలు వాటి నిరర్థక ఆస్తులను వినియోగంలోకి తెచ్చేవిధంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి సమర్పించాల్సిందిగా ఆదేశించారు. సంస్థల వృద్ధితో పాటు రైతాంగ సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు.

# 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యమే లక్ష్యం

**ప్రధాని మోదీ**

**ఢిల్లీ, మహా :** 2036 సంవత్సరంలో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చే హక్కులను దక్కించుకునేందుకు భారత్ సర్వశక్తులు ఒడ్డుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఒలింపిక్స్ నిర్వహణ ద్వారా భారత్‌లో క్రీడా రంగం కొత్త శిఖరాలను అధిరోహిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మంగళవారం ఉత్తరాఖండ్‌లోని డెహ్రాదూన్‌లో 38వ జాతీయ క్రీడల ప్రారంభోత్సవాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ మోదీ ఈ వివరాలను వెల్లడించారు. "ఒలింపిక్స్ ఎక్కడ జరిగినా అన్ని రంగాలు పుంజుకుంటాయి. వాటి వల్ల అథ్లెట్లకు ఉత్తమమైన సౌకర్యాలు, వసతులు అందుబాటులోకి వస్తాయి" అని ప్రధాని చెప్పారు. "దేశంలోని అథ్లెట్లు, క్రీడాకారుల సామర్థ్యాలను పెంచడంపై మేం ఫోకస్ పెట్టాం. తప్పకుండా వారందరికీ దన్నుగా నిలుస్తాం. దేశ వికాసానికి దోహదపడే కీలకమైన విభాగంగా మేం క్రీడలను పరిగణిస్తున్నాం" అని మోదీ పేర్కొన్నారు. "ఏక్ భారత్ శ్రేష్ భారత్ భావనను బలోపేతం చేసే గొప్ప మాధ్యమం క్రీడలు" అని ఆయన తెలిపారు. 2023 సంవత్సరంలో ముంబై వేదికగా జరిగిన అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ సమావేశంలోనే 2036 ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ ఆసక్తిని వ్యక్తం చేసింది. భారత ఒలింపిక్ సంఘం చేసిన ఈ ప్రతిపాదనను అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ నమోదు చేసుకుంది.

**క్రీడాస్ఫూర్తితో యూసీసీని అమలు చేయాలి : ప్రధాని**

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)పై ప్రధాని మోదీ ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. " ఉత్తరాఖండ్‌లో అమల్లోకి



వచ్చిన యూసీసీ విషయంలోనూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి. ఎందుకంటే క్రీడల్లాగే యూసీసీ కూడా ఎవరిపైనా వివక్షకు తావు ఇవ్వదు" అని ప్రధాని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం యూసీసీని అమల్లోకి తేవడం అనేది చారిత్రక నిర్ణయమని ఆయన కొనియాడారు. ఇందుకోసం రాష్ట్రంలోని బీజేపీ సర్కారుకు మోదీ అభినందనలు తెలిపారు. వివాహం, విడాకులు, ఆస్తుల వారసత్వం, సహ జీవన సంబంధాలు వంటి విషయాల్లో సమాజంలోని అన్ని వర్గాల వారికి ఒకే విధమైన చట్టాలను అందించడమే యూసీసీ ప్రత్యేకత. బాల్య వివాహాలు, బహు భార్యత్వం వంటి వాటిని యూసీసీ నిషేధించింది.




# ఉక్కు మహిళలు

## సంకల్పానికి సాటి లేదు..
## విజయాల్లో తిరుగులేదు

“ మహిళలు అత్యంత శక్తివంతమైనవారు. ఆమెకు సాధ్యం కానిదంటూ ఏదీ లేదు. ఇప్పుడు తెలంగాణలో ఈ నిజం కళ్లారా కనిపిస్తోంది. మహిళలు తన శక్తిని ప్రదర్శిస్తూ పైచేయిని సాధిస్తున్నారు. అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ తామంటే ఏంటనేది సమాజానికి నిరూపిస్తున్నారు. చట్టసభల్లో అడుగుపెట్టి.. అదరగొడుతున్న తెలంగాణ మహారాణులపై మహా ప్రత్యేక కథనం... - మహా ప్రత్యేకం, స్పెషల్ డెస్క్

## ఎదురులేని సీతక్క

నీ ఆలోచన గొప్పదైతే కాలం సహకరిస్తుందని చెబుతుంటారు. ఇది అక్షరాల నిజమని నిరూపించారు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క. పేద ప్రజల అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళ్తూ అత్యంత శక్తివంతమైన మహిళగా పేరు గడిస్తున్నారు. ప్రజల్లో సీతక్కకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. ఇంటి నుంచి అడవి... అడవి నుంచి అక్షరం... అక్షరం నుంచి ప్రజాసేవ.. ప్రజాసేవ నుంచి ప్రజాప్రతినిధి.. ప్రజాప్రతినిధి నుంచి రాష్ట్ర మంత్రి. ఈ విధంగా ధనసరి అనసూయ పేద ప్రజలకు దగ్గరవుతున్నారు. ఆమె బలమైన ఆకాంక్ష, సేవా కార్యక్రమాలు, ప్రజలు అభివృద్ధి చెందేలా వినూతన్న నిర్ణయాల కారణంగా ఆమె వద్దకే పదవులు వచ్చి చేరుతున్నాయి. ఎంత సంపాదించామంటూ లెక్కలేసుకునే ఈ రోజుల్లో ఒక నాయకురాలిగా ప్రజలకు ఎంతవరకు మంచి చేశానంటూ సీతక్క ప్రతిరోజూ లెక్కలేసుకుంటున్నారు. ఇటు తనపై ఉంచిన నమ్మకాన్ని ఏరోజూ కూడా వమ్ముచేయకుండా తోడ పుట్టకున్నా సొంత చెల్లెలుగా రాష్ట్ర ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి చెల్లెలుగా పేరొందుతున్నారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రెస్ట్ లేకుండా పనిచేస్తున్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా తీవ్రంగా కృషి చేస్తున్నారు. తన శాఖలో ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను సైతం ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేందుకు సైతం మార్గాలను చూపించారు. ముఖ్యంగా తనను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ములుగు ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారు. ఆ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుకు కృషి చేస్తున్నారు. సేవా కార్యక్రమాలు చేస్తుండడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, పేదపిల్లలను చదువుకు దగ్గరగా చేయడం వంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. అటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సైతం ఎంతో కష్టపడుతున్నారు. హంగులు అర్భాటాలకు పోకుండా నిత్యం జనాల మధ్యే ఉంటూ ప్రజల నిరాజనాలు అందుకుంటున్నారు. సీతక్క మా అందరికీ ఆదర్శం అంటూ ప్రజలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ క్రమంలో సీతక్క పేరు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది. దీంతో సీతక్కకు మంచి గుర్తింపు లభిస్తోంది. ఇంకా భవిష్యత్ లో ఆమె మరిన్ని ఉన్నత పదవుల్లో ఉండాలని జనాలు ఆకాంక్షిస్తున్నారు.





## కొండా సురేఖ డేరింగ్ అండ్ డాషింగ్

సమస్య ఎదురవడం సాధారణం. కానీ, ఆ సమస్యను ఎలా అధిగమించామన్నదే అత్యంత ముఖ్యం. అది ఎంత పెద్ద కష్టమైనా సరే దాని నుంచి బయటపడాలంటే వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. అందుకు ఎంతో గుండె ధైర్యం కావాలి. మనో నిబ్బరం చేసుకోవాల్సి ఉంటుంది. ఇవన్నీ విషయాలు మంత్రి కొండా సురేఖను చూస్తే టక్కున గుర్తొస్తాయి. ఆమె చిన్ననాటి రోజులు, ఆ తరువాత పెళ్లి సందర్భంగా ఎదుర్కొన్న కష్టాలు, రాజకీయాల్లోకి వచ్చిన తదనంతరం ఎదురైన కష్టాలను ఎంతో వ్యూహాత్మకంగా ఎదుర్కొన్నారు. వరుసగా సమస్యలు వచ్చినా ఏనాడు కూడా ధైర్యాన్ని విడనాడలేదు. ఎన్నికల్లో ఓటములు వచ్చినప్పుడు, అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు మనో నిబ్బరంతో ముందుకెళ్లారు. ఎమ్మెల్యే, మంత్రిగా కొండా సురేఖ ప్రజల మన్ననలను పొందుతున్నారు. రాజకీయంగా పలు విమర్శలు వచ్చినా వాటిని అంతేస్థాయిలో తిప్పి కొట్టడంలో ముందుంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. వీరి జీవిత కథ ఆధారంగా సినిమా కూడా వచ్చింది. కొండా సురేఖ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడికి వెళ్లినా అక్క అక్క అంటూ ఆప్యాయంగా పిలుచుకుంటూ తమ కుటుంబ సభ్యురాలిగా ఓన్ చేసుకుంటారు. నాడు రాజశేఖర్ రెడ్డి హయాంలో, ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్ లో మంత్రిగా కొనసాగుతున్న కొండా సురేఖకు జనాల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతుంది.

మహా ప్రత్యేకం

MAHAA SPECIAL

## సబితమ్మ రూటే సపరేటు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈమె హోంమంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఈమె హోంమంత్రిగా సక్సెస్ అవుతారా ? అంటూ పలువురు అనుమానం వ్యక్తం చేశారు. కానీ, సక్సెస్ అయ్యి చూపించారు. అదేవిధంగా బీఆర్ఎస్ హయాంలోనూ విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి తాండూర్ చెల్లెమ్మగా గుర్తింపు ఉంది. తన భర్త ఆశయాలను నెరవేర్చేందుకు, రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహం, పేద ప్రజలకు సేవ చేయాలన్న తలంపుతో రాజకీయాల్లోకి వచ్చిన ఈమెను ప్రజలు ఎంతో గౌరవిస్తారు. కుటుంబంలో అనుకోని విధంగా విషాదం చోటు చేసుకుని, కుటుంబ బాధ్యతలను తీసుకుని ఇంటి పెద్దగా సక్సెస్ అవ్వగలిగారు. అటు ప్రజాప్రతినిధిగానూ విజయం సాధించారు. ప్రత్యర్థులపై విమర్శలు చేయాల్సి వచ్చినా సద్విమర్శలు చేస్తూ తన హుందాతనాన్ని చాటుకుంటారు. ఒక ప్రజాప్రతినిధి ఎలా ఉండాలో అనేదానికి అసలైన అర్థంగా నిలుస్తున్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ పోరు చేస్తోంది. ఈ పోరాటంలో సబితా ఇంద్రారెడ్డి కీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ హైకమాండ్ ఏ పిలుపు ఇచ్చినా తూచా తప్పకుండా పాల్గొంటున్నారు.



## జనం మెచ్చిన యశస్విని

అనుకోని సందర్భంలో రాజకీయాల్లోకి అడుగుపెట్టి ఎమ్మెల్యేగా గెలిచారు పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్వినీరెడ్డి. గెలిచినప్పటి నుంచి తన నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి ఈ యువ ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో ముందుంటున్నారు. ఎక్కడ ఎవరికి ఏ సమస్య వచ్చినా క్షణాల్లో వాలిపోతున్నారు. అటు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఆదేశాలను శిరసావహిస్తూ ఏ పని అప్పజెప్పినా ఫలితాలు రాబడుతున్నారు. సభలు, సమావేశాలు, ప్రత్యర్థులపై విమర్శలు, అసెంబ్లీ సమావేశాల్లో ఈమె ప్రసంగాలను చూసి జనం ఫిదా అయిపోతున్నారు. సీనియర్ నాయకులు సైతం ఆశ్చర్యపోతున్నారు. యశస్వినీరెడ్డి... మీరు సూపర్ అంటూ అభినందనలు తెలుపుతున్నారు. తన అత్త ఝాన్సీరెడ్డికి ఇస్తున్న గౌరవం, చూపిస్తున్న ప్రేమను చూసి ప్రజలు ప్రశంసిస్తున్నారు. కోడలు అంటే ఇలా ఉండాలిరా అంటూ ఈ యువ ఎమ్మెల్యేకు మంచి మార్కులిస్తున్నారు.



## రాగమయి.. ప్రజాసేవలో స్పెషల్

సత్తిపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి తన పనితీరుతో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈమెకు ప్రజల్లోనే కాదు ప్రతిపక్షాలు సైతం ఎంతో గౌరవిస్తాయి. వైద్యురాలు అయిన ఈమె తన భర్త దయానంద్ విజయ్ అడుగు జాడల్లో నడుస్తూ ఎమ్మెల్యే అయ్యారు. తన నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు.



## హుందాతనానికి మారుపేరు పద్మావతి

ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్న మాటకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సరితూగుతారు. ఈమె 2014లోనూ ఎమ్మెల్యేగా పనిచేశారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీమణి పద్మావతిరెడ్డి. ఈ విధంగా ఎంతో పేరు, ప్రఖ్యాతలు ఉన్నా కూడా ఏనాడు కూడా గొప్పలకు పోకుండా హుందాతనానికి మారు పేరుగా నిలుస్తున్నారు. ప్రజాసేవ లక్ష్యంగా ముందుకు కదులుతూ ఇతరులకు, ముఖ్యంగా మహిళలకు ఈ ఎమ్మెల్యే ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ ఎమ్మెల్యే సేవలను గుర్తించిన కాంగ్రెస్ అధిష్టానం ఈమెకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చే అవకాశం ఉందనే వార్తలు సైతం వినిపిస్తున్నాయి.



## ప్రజల మనసు గెలిచిన పర్ణిక

నారాయణ పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి కూడా అనుకోని సందర్భంలో రాజకీయాల్లోకి వచ్చారు. తన మేనమామ అయిన కుంభం శివకుమార్ రెడ్డి ఆశయాలను నెరవేరుస్తున్నారు. నిత్యం పేద ప్రజల్లో ఉంటూ వారి మన్ననలు పొందుతున్నారు. ఈమె ఎక్కడికి వెళ్లినా ప్రజల వద్దకు స్వయంగా వెళ్లి ప్రేమగా పలకరిస్తూ తన గొప్ప మనసును చాటుకుంటున్నారు. సమస్యలు ఉన్నయంటూ ప్రజలు తన వద్దకు వస్తే క్షణాల్లో స్పందించి, ఆ సమస్య వెనువెంటనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తున్నారు. దీంతో ఈ యువ ఎమ్మెల్యేకు మంచి గుర్తింపు వస్తుంది. ఈ విధంగా యువతకు పర్ణికారెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారు.



## జేజేలు అందుకుంటూ...

నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మీరెడ్డి సైతం ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉమ్మడి ఏపీలో ఈమె మంత్రిగానూ పనిచేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ తొలి చైర్ పర్సన్ గా పనిచేసి చరిత్ర సృష్టించారు. తన నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తూ జనం జేజేలు అందుకుంటున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో సునీతా లక్ష్మీరెడ్డికి గొప్ప గుర్తింపు ఉంది. ఇలా ఇతర మహిళా నేతలు, కార్యకర్తలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యమిస్తుండగా, ప్రస్తుతం ఇద్దరు తెలంగాణ కేబినెట్ లో మంత్రులుగా ఉన్నారు.

# రిటైర్మెంట్ @ 65

## ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపు ?

కేబినెట్ లో చర్చించి తుది నిర్ణయం.. ఖజానాపై భారమే ప్రధానం

ఈ ఏడాది 9 వేల మంది పదవీ విరమణ.. రానున్న మూడేళ్లలో దాదాపు 24 వేల మంది

రిటైర్మెంట్ చెల్లింపులకు 20 వేల కోట్లు అవసరం

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ విషయంలో కీలక నిర్ణయం తీసుకునే ఛాన్స్ కనిపిస్తోంది. ఆదివారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 65 ఏళ్లకు పెంచే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని చెప్పారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును కూడా పెంచుతారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. 2021లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచింది. 58 ఏళ్ల నుంచి 61 సంవత్సరాలకు పెంచారు. ఈ చర్య వల్ల పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కోల్పోతామంటూ యవత, నిరుద్యోగులు ఆందోళనలు చేపట్టారు. ప్రస్తుతం ప్రభుత్వం కూడా ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంచాలని భావిస్తుండగా నిరుద్యోగుల నుంచి వ్యతిరేకత ఎలా ఉంటుందన్న చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 మాసాల వ్యవధిలో దాదాపు 55 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయటం, జాబ్ క్యాలెండర్ విడుదల చేసి దాని ప్రకారం మిగిలిన ఖాళీలను భర్తీ చేయాలని యోచిస్తుండటంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వ ఉద్యోగుల వయో పరిమితి పెంచితే నిరుద్యోగుల నుంచి వ్యతిరేకత రాదని భావిస్తున్నారు. ఈ మేరకు ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపుపై మంత్రివర్గ సహచరులతో సంప్రదింపులు జరిపి తుది నిర్ణయం తీసుకోవాలని సీఎం రేవంత్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### నిధుల లేమితోనే ?

ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులు రూ. 8,200 కోట్లకు చేరాయి. మరో ఆరు నుంచి ఎనిమిది నెలల్లో 6,000 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేసే అవకాశం ఉంది. దీంతో రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించేందుకు అదనంగా మరో రూ. 5 వేల కోట్లు అవసరమవుతాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు నెలవారీ రూ.6,500 కోట్ల జీతాలు, పెన్షన్‌లను సకాలంలో విడుదల చేస్తున్నా మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఇతర ఖర్చుల కోసం ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయలేకపోతుంది. ఇప్పటికే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ హౌసింగ్ స్కీమ్‌లను అమలు చేయడానికి నిధులను అప్పుగా తీసుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగులు రిటైర్మెంట్ అయితే పెండింగ్ బిల్లులు,




పదవీ విరమణ ప్రయోజనాలను ఏకమొత్తంలో చెల్లించేందుకు ప్రభుత్వం వద్ద డబ్బు లేదు. పదవీ విరమణ వయస్సును పెంచటం ద్వారా ఆయా చెల్లింపులను మూడు నుంచి నాలుగేళ్ల పాటు ఆలస్యం చేయటానికి అవకాశం ఉంటుందని ఓ ఉద్యోగుల సంఘం నాయకుడు వెల్లడించారు. నిధుల కొరత కారణంగానే రిటైర్మెంట్ పెంపు నిర్ణయానికి మొగ్గు చూపే ఛాన్స్ ఉందని అంటున్నారు. 2025 క్యాలెండర్ ఇయర్‌లో దాదాపు 9 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తారని ప్రభుత్వ వర్గాల అంచనా. 2026, 2027, 2028లో ప్రతి ఏడాది 8 వేలకు పైగా రిటైర్ అయ్యే అవకాశం ఉంది. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సెటిల్ చేయటానికి అప్పుడు ప్రభుత్వానికి దాదాపు రూ. 20 వేలు కోట్లు అవసరం కావచ్చు. హెచ్ఆర్ఏ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ మొదలైన వాటితో సహా పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. అందుకు భారీగా నిధులు కావాల్సి ఉండటంతో ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంచాలని రేవంత్ సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం.

# ముస్లిం మహిళ పిటిషన్‌పై అభిప్రాయం చెప్పండి

## కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం

- షరియత్ నుంచి మినహాయించండంటూ పిటిషన్ వేసిన మహిళ
- మే 5న వాదనలు వింటామన్న అత్యున్నత న్యాయస్థానం

**ఢిల్లీ, మహా :** ముస్లిం వ్యక్తిగత చట్టం షరియత్ నుంచి తనను మినహాయించాలని ఓ మహిళ వేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు కేంద్రం అభిప్రాయాన్ని అడిగింది. ముస్లింలను మినహాయించడం సహా భారతీయ వారసత్వ చట్టంలోని ఇతర నిబంధనలను సవాలు చేయడానికి వీలుగా పిటిషన్‌ను సవరించడానికి పిటిషనర్‌కు అనుమతి ఇచ్చింది. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, కేవీ విశ్వనాథన్ ధర్మాసనం ఈ పిటిషన్‌ను మంగళవారం పరిశీలించింది. దీనిపై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. దీనిపై మే 5 నుంచి వాదనలు వింటామని తెలిపింది.

### ఇదీ కేసు

కేరళకు చెందిన షఫియా పీఎమ్ 'ఎక్స్‌ముస్లిమ్స్ ఆఫ్ కేరళ' అనే బృందానికి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఇందులో ఇస్లాంను వదులుకున్న వారు ఉంటారు. తనను ముస్లిం వ్యక్తిగత చట్టం షరియత్ కాకుండా భారతీయ వారసత్వం చట్టం ప్రకారం పాలించాలని సుప్రీం కోర్టులో షఫియా పిటిషన్ దాఖలు చేశారు. తాను అధికారికంగా ఇస్లాం విడిచిపెట్టలేదని, ఆర్టికల్ 25 ప్రకారం మతానికి సంబంధించి తనకున్న ప్రాథమిక హక్కులు ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు. ముస్లిం పర్సనల్ చట్టం కింద ఉండటానికి ఇష్టపడని వారిని, 'సెక్యులర్ చట్టం' అయిన భారతీయ వారసత్వం చట్టం,1925 కింద పరిగణించడానికి అనుమతించాలని సుప్రీంకోర్టును పిటిషనర్ కోరారు. ఇండియన్ యంగ్ లాయర్స్ అసోషియేషన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ శబరిమల కేసు తీర్పు ప్రకారం రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం మతానికి సంబంధించిన ప్రాథమిక హక్కుల్లో నమ్మడం లేదా నమ్మకపోవడం అనే హక్కు ఉండాలని వాదించారు. అంటే ఎవరైనా వ్యక్తి తన విశ్వాసాన్ని(మతం) విడిచిపెడితే సదరు వ్యక్తికి వారసత్వం, ఇతర ముఖ్యమైన పౌర హక్కుల విషయంలో ఎలాంటి అనర్హత ఉండకూడదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన పరిణామాలను ఎత్తిచూపుతూ, ధర్మాసనం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని పిటిషనర్ కోరారు. ఇదివరకే సుప్రీం కోర్టు పెండింగ్‌లో ఉన్న కేసుకు ఈ వ్యాజ్యం భిన్నం అని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. 'షరియత్ చట్టం ప్రకారం ఇస్లాం మతాన్ని విడిచిపెట్టిన వ్యక్తిని సంఘం నుంచి బహిష్కరిస్తారు. తర్వాత వారికి తల్లిదండ్రుల ఆస్తిలో ఎలాంటి వారసత్వం హక్కు ఉండదు' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితి నెలకొన్నందున తన కుమార్తె విషయంలో పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. షరియత్ చట్టంలోని సెక్షన్ 2,3 లో ఉన్న అంశాలు తనను నియంత్రించకుండా ఆదేశాలు జారీ చేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఆ చట్టంలో అస్పష్టత ఉందని, న్యాయపరమైన విచారణ ద్వారా సరిచేయవచ్చని పిటిషన్ లో పేర్కొన్నారు. ప్రస్తుతం మతం, కులం లేదని సర్టిఫికేట్ పొందినప్పటికీ భారత వారసత్వ చట్టం కిందకు రామని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆర్టికల్ 25 కింద మతాన్ని ఆచరించాలా వద్దా అనే విలువైన ప్రాథమిక హక్కులకు చట్టం నుంచి రక్షణ లేకపోతే అవి అర్థరహితం అని వాదించారు.



# ఇక నుంచి ప్రతి శనివారం నో బ్యాగ్ డే

- యాక్టివిటీస్ రూపొందించాలని ఆదేశం
- పార్ ఐడీ అనుసంధానంపై ఆరా
- వెల్లడించిన మంత్రి నారా లోకేశ్



**మహా:** ఏపీలో ఇక ప్రతి శనివారం నుంచి 'నో బ్యాగ్ డే' అమలు కాబోతుంది. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. దీనికి సంబంధించి విద్యార్థులకు యాక్టివిటీస్ రూపొందించాలని ఆయన తాజాగా అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యలో గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117 ఉపసంహరణపై క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నుంచి అభిప్రాయ సేకరణ చేసిన తరువాత అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించాలన్నారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యపై అధికారులతో మంగళవారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. త్వరలోనే చేపట్టబోయే ఉపాధ్యాయ బదిలీ చట్టంపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ అంశంపై ఉపాధ్యాయులు, సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించాలని వారికి మంత్రి సూచించారు. సాంకేతికత సాయంతో ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. ఉపాధ్యాయులకు ఇప్పుడున్న అనేక యాప్‌ల స్థానంలో ఒకటే యాప్‌ను రూపొందించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వాస్తవ సంఖ్యను నిర్ధారించేందుకు అపార్ ఐడీ అనుసంధానంపై లోకేశ్ ఆరా తీశారు.

# ఒక్క మాట మాట్లాడినా భారీ జరిమానా

## చంద్రబాబు కేసులను సీబీఐకి బదిలీ చేయాలన్న పిటిషన్లు కొట్టివేత



**న్యూఢిల్లీ, మహా :** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేసులను సీబీఐకి బదిలీ చేయాలన్న పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఇది పూర్తిగా పనికిమాలిన పిటిషన్ అని జస్టిస్ బేలా త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై ఒక్క మాట మాట్లాడినా భారీగా జరిమానా విధిస్తామని పేర్కొంది. చంద్రబాబుపై సీఐడీ నమోదు చేసిన 7 కేసులు సీబీఐకి బదిలీ చేయాలని హైకోర్టు న్యాయవాది బి. బాలయ్య సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బాలయ్య తరపున వాదనలు వినిపించడానికి సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్ సిద్ధమయ్యారు. మణీందర్ సింగ్‌పై తీవ్రస్థాయిలో జస్టిస్ బేలా త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి కేసుల్లో కూడా మీలాంటి సీనియర్లు హాజరవుతారని అసలు ఊహించలేదని సర్వోన్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇది పూర్తిగా పనికిమాలిన పిటిషన్ అని తెలిపింది. దీనిపై ఒక్కమాట మాట్లాడినా భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించింది. ఒక్క మాట కూడా వినకుండానే సుప్రీంకోర్టు పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.



# నేను సరికొత్త విధానాన్ని ప్రారంభించా..

## మీతో పంచుకోవడానికి సంతోషిస్తున్నా.. రాజ్యసభ మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి

**మహా:** రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి తాజాగా ఆయన మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాజ్యసభకు రాజీనామా అనంతరం చేసిన ప్రకటన అనుగుణంగా తన భవిష్యత్‌ను మరల్చుకోవడానికి సాయి రెడ్డి చర్యలను స్టార్ట్ చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. 'నా హార్టికల్చర్ కార్యకలాపాలకు నేను సరికొత్త విధానాన్ని ప్రారంభించానని మీతో పంచుకోవడానికి సంతోషిస్తున్నాను' అంటూ ఆయన ఆ పోస్ట్ లో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. తన పదవికాలం మరో మూడేళ్లపాటు ఉండగానే నాలుగు రోజుల క్రితం తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ట్విటర్‌లో చేసిన ప్రకటన సంచలనంగా మారిన విషయం తెలిసిందే. మరుసటి రోజే తన రాజీనామా పత్రాన్ని రాజ్యసభ చైర్మన్ జగదీష్ ధన్‌కడ్‌కు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను పూర్తిగా రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఇక తనకిష్టమైన హార్టికల్చర్ సాగువైపు దృష్టిని సారిస్తానని పేర్కొన్న విషయం తెలిసిందే.

# గద్దర్‌కు ఎల్ టిటిఈ తీవ్రవాదికి పెద్ద తేడా ఏమీ లేదు

- బీజేపీ నేత వివాదాస్పద వ్యాఖ్యలు..
- అగ్గి మీద గుగ్గులం పోసిన విష్ణువర్ధన్ రెడ్డి
- ప్రజాస్వామ్య విధానాలకు గద్దర్ బద్ధ వ్యతిరేకి
- గద్దర్ పై ఇప్పటికీ కేసులున్నాయని వ్యాఖ్య



**ఢిల్లీ, మహా :** తెలంగాణలో రాజకీయాలు మరోసారి భగ్గుమన్నాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఏటా పద్మ అవార్డులు ఇస్తూ రావటం ఆనవాయితీ. ఈసారి కూడా ఎప్పటిలాగే కేంద్ర సర్కార్ పద్మ అవార్డులు ప్రకటించగా అది ఇప్పుడు తెలంగాణలో అగ్గి రాజేస్తోంది. తెలంగాణపై కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపిందని రేవంత్ రెడ్డి సర్కార్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా దానికి బీజేపీ నేతలు కూడా అదే స్థాయిలో కౌంటర్లు ఇస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ తరపున గద్దర్ లాంటి గొప్ప పోరాట వీరుడికి పద్మ అవార్డు ప్రకటించాలని రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిపాదన పంపారన్న విషయం బయటికి రావటంతో అగ్గిలో మరింత ఆజ్యం పోసినట్టయింది. ఈ అంశంపై స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామని ఆయన భావాజాలం ఏంటీ..? అంటూ ప్రశ్నించటమే కాకుండా ఆయనకు పద్మ అవార్డు ఇచ్చే ప్రసక్తే లేదని కుండబద్దలు కొట్టేశారు. తమ కార్యకర్తలను చంపారని, ఎంతో మంది పోలీసులను పొట్టనబెట్టుకున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేయటం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో బండి సంజయ్ మీద కాంగ్రెస్ నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కేంద్ర మంత్రి పదవి నుంచి ఆయనను వెంటనే బర్తరఫ్ చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. బండి సంజయ్ చేసిన కామెంట్లతోనే రాష్ట్రంలో చాలా మంది అగ్గి మీద గుగ్గిలమవుతుంటే అది సరిపోదన్నట్టు బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి తన వ్యాఖ్యలతో ఇప్పటికే రగిలిపోతున్న అగ్గికి మరింత ఆజ్యం పోశారు. గద్దర్‌కు ఎల్టీటీఈ తీవ్రవాదికి పెద్దగా తేడా ఏమి లేదని విష్ణువర్ధన్ రెడ్డి సంచలన కామెంట్లు చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అనేక మంది ప్రాణాలు తీసిన నరహంతకుడు గద్దర్ అని కాంట్రవర్సి కామెంట్లు చేశారు. భారత ప్రజాస్వామ్య విధానాలకు గద్దర్ బద్ధ వ్యతిరేకి అని విష్ణువర్ధన్ రెడ్డి గుర్తుచేశారు. నిషేధిత మావోయిస్టు సంస్థలో ఉన్న గద్దర్‌కు అవార్డు ఎలా ఇవ్వాలని ప్రశ్నించారు. ఎల్టీటీఈకి కూడా పద్మ అవార్డులు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి అంటారా అని ప్రశ్నించారు. లేక గద్దర్ కుమార్తె ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న కారణంగా పురస్కారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారా అని సెటైర్లు వేశారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో గద్దర్‌పై అనేక కేసులు ఉన్నాయని విష్ణువర్ధన్ రెడ్డి గుర్తుచేశారు.

# ఈ నెల 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

## రెండు విడతలుగా బడ్జెట్ సమావేశాలు.. ఫిబ్రవరి 1న లోక్‌సభలో కేంద్రం బడ్జెట్-2025

**మహా:** ఈ నెల 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు శుక్రవారం పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. పార్లమెంట్ సమావేశాలు రెండు విడతల్లో జరుగనున్న విషయం తెలిసిందే. తొలి విడత సమావేశాలు 31 నుంచి ప్రారంభమై.. ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయి. ఇక రెండో విడత సమావేశాలు మార్చి 10న మొదలై.. ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి. మంగళవారం విడుదలైన పార్లమెంటరీ బులిటెన్ ప్రకారం.. ఆర్థిక



మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న లోక్‌సభలో కేంద్రం బడ్జెట్ 2025ను ప్రవేశపెట్టనుంది. అంతకు ముందు రోజు రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రాష్ట్రపతి ప్రసంగం తరువాత రాజ్యసభ కార్యకలాపాలు ప్రారంభంకానున్నాయి.

# తిరుమలలో సింగర్ సునీత అద్భుత గానం

## స్వామివారిని కీర్తిస్తూ పాట పాడిన సింగర్.. స్వామివారిని దర్శించుకున్న గాయని

**ఏపీ:** తిరుమల తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర్ స్వామిని ప్రముఖ గాయని సునీత మంగళవారం దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో ఆమె పాల్గొన్నారు. ఈ టీటీడీ అధికారులు ఆమెకు ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గర్భాలయంలో స్వామివారిని ఆమె దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆమెకు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపలకు



వచ్చిన సునీత.. స్వామివారిని కీర్తిస్తూ అద్భుతంగా పాట పాడి ఎంతగానో అలరించారు.

# సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్

## ఇక శుభం కార్డు పడ్డట్లే.. నమ్మి అధికారం ఇస్తే ఘోరంగా మోసం చేశారు

## ఆ ప్రజెంటేషనే ఇందుకు నిదర్శనం.. చంద్రబాబుపై షర్మిల ఫైర్



**ఏపీ:** కూటమి ప్రభుత్వంపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు ఇక శుభం కార్డు పడ్డట్లే అని ఆమె అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం ఇచ్చిన ప్రజెంటేషన్ ఇందుకు నిదర్శనమని అన్నారు. సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాఫ్ అంటూ షర్మిల ఎద్దేవా చేశారు. నీతి ఆయోగ్ రిపోర్ట్ ముందుపెట్టి, డబ్బులుంటేనే పథకాలని నీతి సూక్తులు చెప్పారంటూ చంద్రబాబుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాలు కావాలంటే ఆదాయం పెంచాలంటున్నారని.. మోకాలికి బోడి గుండుకు ముడిపెట్టినట్లుంది చంద్రబాబు తీరు అని ఆమె విమర్శించారు. నమ్మి అధికారం ఇస్తే రాష్ట్ర ప్రజలను ఘోరంగా మోసం చేశారంటూ షర్మిల ఆరోపించారు. 50 లక్షల మంది అన్నదాతలను వంచించారని.. 80 లక్షల మంది విద్యార్థులకు ద్రోహం చేశారని.. కోటిన్నర మంది మహిళలను మోసం చేశారని.. 50 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుకున్నారంటూ షర్మిల మండిపడ్డారు. పథకాలకు ఆర్థిక వెసులుబాటు లేదని, గత వైసీపీ ప్రభుత్వ ఆర్థిక విధ్వంసమే కారణమని చంద్రబాబు చెప్పారంటూ ఆమె గుర్తుచేశారు. జగన్ ఆర్థిక ఘోరమే నిదర్శనమని చెబుతున్న చంద్రబాబు.. ఎన్నికల్లో హామీలు ఇచ్చేముందు తెలియదా ఈ ఆర్థిక విధ్వంసం, ఘోరమని అంటూ షర్మిల నిలదీశారు. 'సూపర్ సిక్స్' పథకాల రూపకల్పనలో కనపడలేదా రాష్ట్ర ఆర్థిక భారం అంటూ ఆమె ప్రశ్నించారు. రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని చెప్పింది మీరే కదా అంటూ ఆమె గుర్తుచేశారు. కూటమిని గెలిపిస్తే 100 రోజుల్లో గాడిన పెడతామన్నది మీరేనని.. తీరా ఓట్లు పడ్డాక ఇచ్చిన హామీలపై మడతపేచీ పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని, అప్పులు పుట్టడం లేదంటూ సాకులు చెప్పడం మానుకుని.. పథకాల అమలుపై దృష్టి పెట్టాలని ఏపీ కాంగ్రెస్ తరపున షర్మిల డిమాండ్ చేశారు. కేంద్రంలో పెద్దన్న పాత్ర పోషించే మీరు.. రాష్ట్ర దీనస్థితిపై ప్రధాని మోదీని పట్టుబట్టాలన్నారు. పథకాలకు కావాల్సిన నిధులు ఇవ్వాలని అడగాలన్నారు. నీతి ఆయోగ్ చెప్పినట్లుగా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన ఆర్థిక అరాచకంపై వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించాలన్నారు. రాష్ట్ర ఆదాయం ఏ కోటకు మళ్ళిందో తేల్చాలన్నారు. పథకాలకు కేంద్రం డబ్బులివ్వకపోతే వెంటనే బీజేపీకి ఇచ్చిన మద్దతు ఉపసంహరించుకోవాలన్నారు.

## డ్రగ్స్, సైబర్ క్రైం పై
# అవగాహన సదస్సు



ములుగు, మహా : ములుగు జిల్లా కేంద్రంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్లో ఎస్సై బి రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ క్రైమ్,డ్రగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో రాబోయే దుష్ప్రభావాలను ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా మొబైల్ యాఫ్ లతో అసంబంధిత లింకులు ఓపెన్ చేయవద్దని తెలియపరుచారు. ప్రస్తుత సమాజంలో యువత డ్రగ్స్ కు బానిస కావడం వలన కేంద్రీయ నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని తెలియపరిచారు. ఈ రెండు అంశాలపై ఏదైనా సందేహాలు, సలహాలు విద్యార్థిని, విద్యార్థుల వద్ద



ఉన్నట్లయితే పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులకు లేదా పోలీస్ హెల్ప్ లైన్లకు సమాచారాన్ని అందించలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ కొలగాని రజనీకాంత్, అధ్యాపక బృందం సుకృత, శిరీష, రంజిత్ రెడ్డి. సురేశ్, రతన్ సింగ్ పోలీస్ సిబ్బంది బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## జూలాజికల్ పార్క్ లోని జంతువులను
# దత్తత తీసుకున్న మంత్రి

వరంగల్, మహా: అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ హన్మకొండ కాకతీయ జూలాజికల్ పార్క్ లోని నీల్గాయ్, సాంబార్ డీర్, చౌసింగా, అడవి దున్నలను ఒక్కోటి చొప్పున మంగళవారం దత్తత తీసుకున్నారు. ఈ మేరకు కాకతీయ జూపార్క్ అసిస్టెంట్ క్యురేటర్ మయూరి హన్మకొండ రాంనగర్ లోని మంత్రి కొండా సురేఖ నివాసానికి వచ్చి వన్యప్రాణల దత్తత ప్రక్రియను పూర్తి చేశారు. సంవత్సర కాలానికి ఒక్కో వన్యప్రాణికి ఆహారం, సంరక్షణ కోసం రూ. 50 వేల చొప్పున మొత్తం నాలుగు వన్యప్రాణులకు కలిపి రూ. 2 లక్షలను మంత్రి సురేఖ ఆన్లైన్ లో చెల్లించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, జూలలోని వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి పక్షి ప్రేమికులు, జంతు ప్రేమికులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యక్తులు, సంస్థలు, సంఘాలు వారి వారి సామర్థ్యాన్ని బట్టి చిన్న చిన్న పక్షులు, తాబేళ్ళు మొదలు పులుల వరకు మూడు



నెలలు, ఆరు నెలలు, సంవత్సరం చొప్పున దత్తత తీసుకుని, వాటి సంరక్షణ బాధ్యతలను చేపట్టవచ్చిన మంత్రి సురేఖ తెలిపారు. జంతు ప్రేమికులు అటవీ అధికారులను సంప్రదించి వన్యప్రాణుల దత్తతకు సంబంధించిన మార్గదర్శకాలను అనుసరించి, వారి వారి ఇష్టానుసారం జంతువులను దత్తత తీసుకునే వెసులుబాటును అటవీశాఖ కల్పిస్తున్నదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. వన్యప్రాణుల దత్తత కోసం చేసిన చెల్లింపులకు ఆదాయ పన్ను మినహాయింపు, ఇతర ప్రయోజనాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని అటవీ అధికారులకు మంత్రి సురేఖ సూచించారు.



## లారీని వెనకనుంచి
# ఢీ కొట్టిన మరో లారీ

- క్యాబిన్లో ఇరుక్కున్న డ్రైవర్
- అతి కష్టం మీద బయటకు తీసిన 108 సిబ్బంది
- ములుగు మండలం మల్లంపల్లి వద్ద అర్ధరాత్రి ఘటన

ములుగు, మహా : ఇసుక లోడుతో వెళ్తున్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీ కొట్టిన సంఘటనలో డ్రైవర్ క్యాబిన్లో ఇరుక్కుపోగా అతి కష్టం మీద 108 సిబ్బంది బయటకు తీసిన సంఘటన ములుగు మండలం మల్లంపల్లి కెనాల్ బ్రిడ్జి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఒంటిగంటకు జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. టీజీ 07 యూ 1149 నెంబర్ గల లారీలో డ్రైవర్ బాలకృష్ణ ఏటూరునాగారం నుంచి ఇసుక లోడుతో ములుగు మీదుగా హైదరాబాద్ కి వెళ్తున్నాడు. మంగళవారం తెల్లవారు జామున ఒంటి గంటకు మల్లంపల్లి కెనాల్ బ్రిడ్జి వద్దకు చేరుకోగా ముందు వెళ్తున్న లారీ రోడ్డుపై గతుకులతో ఒక్కసారి బ్రేక్ వేశాడు. గమనించకుండా డ్రైవర్ బాలకృష్ణ ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్లోనే ఇరుక్కున్న బాలకృష్ణను 108 సిబ్బంది మరో లారీ డ్రైవర్ల సహాయంతో తాళ్లను కట్టి అరగంట శ్రమించి బయటకు తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ బాలకృష్ణ కు కాలు చేయి విరగగా తలకు గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అందించిన 108 పైలట్ శంకర్, ఈఎంటి నాగరాజు వరంగల్ ఎంజీఎం కు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ పథకాలు పేదలకు వరం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్
- సీఎం రేవంత్ రెడ్డి మంత్రి సీతక్కలకు క్షీరాభిషేకం



ములుగు, మహా : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేదలకు వరమని, గణతంత్ర దినోత్సవం రోజున ప్రారంభించిన 4 పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందుతున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ములుగు మండలం జీవంతరావుపల్లి గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి సీతక్క చిత్రపటాలకు రైతులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ. తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 26న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా 4 కొత్త సంక్షేమ పథకాలను ప్రారంభించిందని, ములుగు మండలంలో జీవంతరావుపల్లి గ్రామంలో ఈ పథకాలు అమలు చేయడం సంతోషకరమన్నారు. రైతు భరోసా డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినందుకు రైతులు అందరూ ఎంతో సంతోషంగా సంబరాలు జరుపుకు న్నారని, సీఎం, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లలో రైతులను, పేదలను పట్టించుకున్న పాపాన పోలేదని, కనీసం రేషన్ కార్డులు కూడా అందించలేదన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలంలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల ప్రభుత్వంగా పేరుగాంచింది అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఆంగోత్ వంశి క్రిష్ణ, ములుగు మండల పార్టీ ఎస్టి సెల్ అధ్యక్షుడు ఆలోత్ దేవ్ సింగ్, గ్రామస్తులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## బండి సంజయ్
## దిష్టి బొమ్మ దహనం

ఆదిలాబాద్ మహా : ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ పై అనుచిత వాక్యాలు చేసిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ భేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ జిల్లా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ మేరకు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. బిజెపి భావజాలం ఉన్న వ్యక్తులకే పద్మశ్రీ అవార్డును ఇస్తామన్నట్లుగా బండి సంజయ్ వ్యాఖ్యలు ఉన్నాయని, ఇది రాష్ట్రపతిని, ప్రధానమంత్రిని అవమానించడమే అవుతుందని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ అన్నారు. ఈ విషయంలో బండి సంజయ్ స్పందించి తన మాటాలను వెనక్కి తీసుకుని బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. లేదంటే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు మేకల మల్లన్న ,ప్రధాన కార్యదర్శి బొబ్బిలి సుధాకర్, ఉపాధ్యక్షులు సురేష్ ,సభ్యులు రాఘవేంద్ర, నరేందర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి బాలికల వసతి గృహంలో బస
# చేయనున్న బల్దియా కమిషనర్



వరంగల్, మహా: వరంగల్ పట్టణంలోని ఉర్స్ గుట్ట వద్ద గల మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను సోమవారం రాత్రి వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ అశ్విని తానజీ వాఖేడే, ఉప కమిషనర్ ప్రసన్నారాణి తో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. సాయంత్రం హాస్టల్‌కు చేరుకున్న కమిషనర్ విద్యార్థులతో మమేకమై వారికి అందిస్తున్న ఆహారం, హాజరు, సంబంధిత రిజిస్టర్లను పరిశీలించి దినచర్యపై ఆరా తీశారు. హాస్టల్ ప్రాంగణాన్ని, వంటశాలను స్టోర్ రూం, కూరగాయలు భద్రపరిచే గదిని, సిసి కెమెరాల నిర్వహణను స్వయంగా కమిషనర్ పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి రాత్రి భోజనం చేశారు. మెనూ ప్రకారం మంచి భోజనం అందించాలని, తాజా కూరగాయలు,ఆకుకూరలు అందించేలా కాంట్రాక్టర్ కు సూచించాలని కమిషనర్ తెలిపారు. పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. హాస్టల్ నిర్వహణపై విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వం ఇస్తున్న కాస్మెటిక్స్ ఛార్జీలు, తదితర వస్తువులు అందాయా అని ఆరా తీశారు. విద్యార్థులు హాస్టల్లో ఎలాంటి సమస్య ఉన్నా అధికారులతో పాటు తన దృష్టికి తేవాలని, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కళాశాలలో విద్యార్థినులతో కలసి కమిషనర్ రాత్రి బస చేశారు. మంగళవారం ఉదయం 5 గంటలకు రెసిడెన్షియల్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు చేసిన యోగ ఆసనాలను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, వార్డెన్లు ప్రియ, వరలక్ష్మి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

### పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా
## సీఎం సహాయ నిధి
### లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎంపీ డా. కడియం కావ్య

హనుమకొండ, మహా:అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హన్మకొండ కనకదుర్గ కాలనిలోని ఎంపీ నివాసంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 5గురు ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 2లక్షల 55వేల రూపాయల విలువగల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ల కోసమే యూపిఎస్ విధానం

- ఏకీకృత పెన్షన్ విధానంని అమలు కానివ్వం..సిపిఎస్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు రవికాంత్
- యూపీఎస్ ప్రతుల దహనం



ములుగు, మహా : సిపీఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిం చాలని దశాబ్ద కాలంగా పోరాటం చేస్తుంటే జనవరి 24న కేంద్ర ఆర్థిక శాఖ కార్పొరేట్ శక్తులకు తలొగ్గి యుపిఎస్ విధానం తీసుకురావడం అప్రజాస్వామి కమని, ఇది కేవలం షేర్ మార్కెట్లోకి నిరంతరాయంగా పెట్టుబడులు పెట్టే విధంగా ఉందని సిపిఎస్ ఉద్యోగుల సంఘం తెలుగు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అన్నవరం రవికాంత్, మంకిడి రవి విమర్శించారు. ఈ విధానంలో ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు సామాజిక భద్రత కోణం లేదని ఆరోపించారు. యూనిఫైడ్ పెన్షన్ విధానంపై జారీచేసిన నోటిఫికేషన్ ను వ్యతిరేకిస్తూ మంగళవారం ములుగులో తెలంగాణ రాష్ట్ర కంట్రీబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో యుపీఎస్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. సిపీఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ పునరు ద్ధరించాలని డిమాండ్ చేశారు. యూపీఎస్ విధానం వల్ల ఉద్యోగి తన సర్వీస్ కాలంలో జమ చేసిన ప్రతినెల బేసిక్, డిఏ లో 10శాతం చొప్పున జమ చేసిన సొమ్మును ఎన్పీఎస్ ట్రస్ట్ కు బదిలీ చేసిన తర్వాతనే ఉద్యోగికి సర్వీస్ పెన్షన్ నిర్ణయించడం అత్యంత దారుణమైన చర్య అన్నారు. దీనిని సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరం వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కంట్రిబ్యూషన్ లేకుండా పెన్షన్ అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, సుప్రీంకోర్టు కేసును గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు సుధాకర్, నరేష్, పత్తిరి శ్రీధర్, సమ్మయ్య, కుమార స్వామి, అరుణ, సౌమ్య, జయ, ఇందిర ప్రియదర్శిని, బాలాజీ, రుక్షాన బేగం, అజ్మత్ పాషా, ఉస్మాన్, సూరయ్య, నరహరి, వివిధ మండలాల ఉద్యోగ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పనులలో వేగం పెంచాలి
### : జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



ములుగు, మహా : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ చిన్న జాతర సమీపిస్తున్నందున పనులలో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం తాడ్వాయి మండలం చింతల్ ఎక్స్ రోడ్, కన్నెపల్లి, మేడారంలలో జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కన్నెపల్లిలోని సారలమ్మ దేవాలయ పరిధిలో అన్ని పనులు, చింతల్ ఎక్స్ రోడ్ వద్ద పార్కింగ్ స్థలాలు, జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలు, డ్రెస్ చేంజింగ్ రూమ్స్, శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయ పరిధిలో విఐపి, వీవీఐపి పార్కింగ్ తదితర పనులలో వేగం పెంచి ఫిబ్రవరి 3వ తారీకు లోపు పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, పంచాయతీరాజ్ ఈ ఈ అజయ్ కుమార్, ఇరిగేషన్ ఈ ఈ నారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల పై
# సర్కారు మల్ల గుల్లాలు

- గ్రామసభల్లో అధికారులు కాంగ్రెస్ నేతలకు భంగపాటు
- 13నెలల పాలనపై ప్రజా వ్యతిరేక పవనాలు
- అందుకే ఈనెల 26న 4..పథకాలకు శ్రీకారం
- మార్చి వరకు పథకాల అమలుపైనే దృష్టి
- ఆ తర్వాతే స్థానిక సంగ్రామం పై కుస్తీ

వరంగల్, మహా : చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవ అన్నట్టు ఉద్యమ పార్టీ కాస్త రాజకీయ పార్టీగా మారడం తోపాటు ప్రజాధ నాన్ని కొల్లగొట్టడం నాయకుల అహంభావం ప్రజా వ్యతిరేకవిధానాలపై ప్రజల నుండి తీవ్రవ్యతిరేకత రావడం ఆ వ్యతిరేక పవనాలు వీచిన క్రమంలోనే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించినట్టుగా బిఆర్ఎస్కుగట్టి ఎదురు దెబ్బ తగిలింది. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కూడాఊహించినట్టే రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర సర్కార్ వెనకడుగు వేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన గ్రామ సభల్లో 13 నెలల కాంగ్రెస్ పాలనపై ఊహించని విధంగా వ్యతిరేకత రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార పార్టీలో చర్చ జరుగుతోంది. సంక్షేమ పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం ఇటీవల నిర్వహించిన గ్రామ సభల్లో ప్రజల నుండి పెద్ద ఎత్తున నిరసనలు పెల్లుబికడం.. పలుచోట్ల అధికారులు, కాంగ్రెస్ నాయకులకు నిలదీతలు మొదలు కావడంతో తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు పార్టీలో జోరుగా చర్చ సాగుతోంది. స్థానిక ఎన్నికలపై సర్కా 13 నెలల పాలనపై బట్టబయలైన ప్రజా వ్యతిరేకత గ్రామసభల్లో అధికారులు, కాంగ్రెస్ నేతలకు నిలదీతలతో సర్కారు కు అనుకూల పవనాలు వీస్తేనే ముందు కెళ్లె యెచనలో ఉన్నట్టు వినిపిస్తుంది.అందుకే ఈ నెల 26న నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టడమే కాకుండా మార్చి వరకు పథకాల అమలుపైనే దృష్టి సారించి ఆ తర్వాతే స్థానిక సంగ్రామం పై దృష్టి సారిస్తున్నట్లు అధికార పార్టీలో ప్రచారం మొదలైంది. గ్రామసభల్లో తమ పేర్లు రాలేదంటూ ప్రజలు భారీ సంఖ్యలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనకు దిగారు. అధికారులు ప్రకటించిన అర్హుల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవంటూ నిలదీశారు. పలుచోట్ల అధికారులును నిలదీసిన ప్రజలు ఇంకొన్ని చోట్ల సభలను అడ్డుకున్నారు. వందలాది గ్రామాల్లో సభలను స్వచ్ఛందంగా బహిష్కరించారు. ప్రభుత్వంపై వ్యతిరేక పవనాలు వీస్తోన్న నేపథ్యంలో ఉన్న ఫలంగా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే భంగపాటు తప్పదనే భావనలో ఉన్న ప్రజా ప్రభుత్వం ఇటు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల బలోపేతంపై ఫోకస్ చేసినట్లు సమాచారం. ఇప్పటికే రాష్ట్రంలో బీజేపీ పుంజుకోవడం, బీఆర్ఎస్ కూడా విమర్శలకు దిగుతుండడం అధికార పార్టీని సందిగ్ధంలో నెట్టివేసింది. ఎన్నికలకు పోయి భంగపడడం కంటే ఊరుకున్నది ఉత్తమం అని కాంగ్రె స్నేతలు భావిస్తున్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత పూర్తిగాప్రతిపక్షాలకు అనుకూలంగా మారే ప్రమాదం ఉందని భావిస్తోన్న కాంగ్రెస్ సర్కార్ ముందస్తు జాగ్రత్త పడుతున్నట్లు కనబడుతోంది. కొలువులోకి తెచ్చిన గ్యారంటీలే కొంప ముంచయా..?ఆరుగ్యారంటీల అమలు విషయంలో ప్రజల్లోప్రభుత్వంపై ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత నెలకొంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలే ఇప్పుడు కొంపముంచుతున్నాయా అనే సందేహం పార్టీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. దీనికి తోడు ఇటీవల ప్రభుత్వం పూర్తి చేసినట్లు చెబుతోన్న పంట రుణమాఫీ విషయంలో పూర్తి క్లారిటీ లేకపోగా రైతులుతీవ్రఆగ్రహంతో ఉన్నారు. రూ.2లక్షలను రుణమాఫీచేస్తానని చెప్పి.. నామ మాత్రంగా చేయడంతోవారు అసహనానికి గురవుతున్నారు.బోనస్ పేరిట కూడా అన్యాయం చేశారని మండిపడుతున్నారు. పెన్షన్ దగ్గరి నుంచి అన్ని హామీలపై ప్రజల నుంచి అధికారులపై ప్రశ్నలు వర్షం కురుస్తున్నారు. దాంతో ప్రభుత్వంలో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. ఇదీలావుంటే.. దావోస్ పర్యటన ముగించుకుని ఈ నెల 24న హైదరాబాద్ కు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి గ్రామ సభ నిర్వహణ తీరు, అందులో వెల్లువెత్తిన నిరసనలపై ఆరా తీసిన విషయం తెలిసిందే. ఇందులో ప్రజా వ్యతిరేకత, నివారణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై రాష్ట్ర ఉన్నతాధికారులు, నిఘా విభాగం, సీనియర్ మంత్రులతో చర్చించినట్లు సమాచారం. అదే సమయంలో ఉన్న ఫళంగా స్థానిక ఎన్నికలకు ముందుకు వెళ్తే ఎలాంటి ఫలితాలు వస్తాయోన నేదానిపై చర్చలు జరిపారు. మరోవైపు సీనియర్ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం స్థానిక పోరు ఇప్పుడే వద్దంటూ టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్ రెడ్డికి సూచించినట్లు సమాచారం. ఇంటలిజెన్స్ ఇచ్చిన నివేదికను వీరు సైతం బలంగా నమ్ముతున్నారు. గ్రామసభల్లో తమకు ఎదురైన అనుభవాలు, ప్రజా వ్యతిరేకతను ఇప్పటికే సీఎంకు వివరించిన పలువురు ప్రజా ప్రతినిధులు ప్రజాక్షేత్రంలో ఓటమిని చవిచూసే కంటే దాని నుంచి తప్పించుకుని పరిస్థితులు చక్కబడ్డాక స్థానిక సమరానికి వెళ్లాలని అధిష్టానానికి విన్నవించినట్లు సమాచారం. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, కరీంనగర్ జిల్లాలకు చెందిన కీలక నేతలు స్థానిక సంస్థల ఎన్నికల వాయిదాకు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఇచ్చిన హామీలు అమలవుతున్నాయని వారికి నమ్మకం కలిగించేలా రెండు, మూడు నెలలు వాటిని పకడ్బందీగా అమలు చేద్దామని, కుదిరితే మే లేదా జూన్ నెలలో ఎన్నికలు నిర్వహిద్దామని ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. అందులో భాగంగానే ప్రభుత్వం ఈ నెల 26న ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు పథకాలకు శ్రీకారం చుట్టినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. మొత్తానికి కొంత కాలంగా ఊరిస్తూ వస్తున్న స్థానిక సమరం.. మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

## అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులు

ఇబ్రహీంపట్నం, జనవరి 28 మహా: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం నందు 202425 విద్యా సంవత్సరానికి గాను కంప్యూటర్ సైన్స్/ అప్లికేషన్స్ అతిథి అధ్యాపక నియామకం 1 ఒక పోస్టు కొరకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తు ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు తమ పీజీ సబ్జెక్టుల లో జనరల్ వారు 55 శాతం, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలి. పీహెచ్ డి, నెట్, సెట్, కలిగిన వారికి మరియు బోధనా అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. దరఖాస్తులు నేడు సాయంత్రం 05:30 గంటల లోపు కళాశాల కార్యాలయంలో ఇవ్వాలి. ఇంటర్వ్యూ 30వ తారీఖు గురువారం నాడు నిర్వహించబడును. ఇంటర్వ్యూ స్థలము మరియు పూర్తి వివరాలు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఫోన్ ద్వారా తెలుప బడును. అర్హత గల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాతో, విద్యార్హతల ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారుల సంతకం చేయించి దరఖాస్తు చేయాలి.

## బల్దియాలో సాధారణ సర్వ సభ్య సమావేశము

వరంగల్, మహా:గ్రేటర్వ రంగల్మ హానగర పాలక సంస్థ, సాధారణ సర్వ సభ్య సమావేశము బుధవారం తేది: 2912025 ఉదయం 11:30గంటలకు మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన వరంగల్ మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కౌన్సిల్ హాల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించ బడుతుందని మంగళవారం బల్దియా అధికారి ఓ ప్రకటనలో తెలిపారు.

# కెమెరా ఐలాండ్.. ఏఐ చార్జింగ్ ప్రొటెక్షన్ ఫోన్
# ఇన్ఫినిక్స్ స్మార్ట్ 9 హెచ్‌డీ లాంచింగ్.. రూ.6,699లకే లభ్యం..!

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ ఇన్ఫినిక్స్ తన ఇన్ఫినిక్స్ స్మార్ట్ 9 హెచ్‌డీ ఫోన్‌ను మంగళవారం భారత్ మార్కెట్‌లో ఆవిష్కరించింది. 2023 డిసెంబర్‌లో ఆవిష్కరించిన ఇన్ఫినిక్స్ స్మార్ట్ 8 ఫోన్ కొనసాగింపుగా ఇన్ఫినిక్స్ స్మార్ట్ 9 హెచ్‌డీ ఫోన్ వస్తోంది. 90 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్, 6.7 అంగుళాల హెచ్‌డీ+ స్క్రీన్, డ్యుయల్ స్టీరియో స్పీకర్స్, డీటీఎస్ ఆడియో ప్రాసెసింగ్ ఉంటుంది. ఇన్ఫినిక్స్ స్మార్ట్ 9 హెచ్‌డీ ఫోన్ బ్యాటరీ హెల్త్, ఓవర్‌చార్జింగ్ నుంచి రక్షణ కల్పించేందుకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) చార్జ్ ప్రొటెక్షన్ ఫీచర్‌తో వస్తుంది. 5000ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది. బ్యాటరీ సింగిల్ చార్జింగ్ పూర్తయితే 14.5 గంటల వీడియో ప్లేబ్యాక్, 8.6 గంటల గేమింగ్ ఫీచర్లు ఉన్నాయి. వైఫై, బ్లూటూత్, యూఎస్బీ టైప్‌సీ పోర్ట్, 3.5 ఎంఎం హెడ్‌ఫోన్ జాక్ కనెక్టివిటీ ఉంటుంది. ఇన్ఫినిక్స్ స్మార్ట్ 9 హెచ్‌డీ ఫోన్ రూ.6,699లకు లభిస్తుంది. స్పెషల్ డే వన్ ఆఫర్ కింద రూ.6,199లకు సొంతం చేసుకుంది. ఫిబ్రవరి నాలుగో తేదీ నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో సేల్స్ ప్రారంభం అవుతాయి. మింట్ గ్రీన్, కోరల్ గోల్డ్, నియో టైటానియం, మెటాలిక్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. 90 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్, 500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, 6.7 అంగుళాల హెచ్‌డీ+ స్క్రీన్, సౌండ్ బూస్ట్ టెక్నాలజీ, డీటీఎస్ ఆడియో ప్రాసెసింగ్‌తోపాటు డ్యుయల్ స్పీకర్లు ఉంటాయి. ఇన్ఫినిక్స్ స్మార్ట్ 9 హెచ్‌డీ ఫోన్ ఒక్టాకోర్ మీడియాటెక్ హెలియో జీ50 ప్రాసెసర్ విత్ 2.2 హెర్ట్జ్ పీక్ క్లాక్ స్పీడ్‌తో వస్తుంది. 6 జీబీ ర్యామ్ (3జీబీ ఫిజికల్ + 3 జీబీ వర్చువల్) విత్ 64 జీబీ స్టోరేజీ వేరియంట్‌గా వస్తుంది. మైక్రో ఎస్డీ కార్డ్ సాయంతో ఒక టిగాబైట్ వరకు స్టోరేజీ కెపాసిటీ పెంచుకోవచ్చు. ఆండ్రాయిడ్ 14 గో ఎడిషన్ వర్షన్‌పై పని చేస్తుంది. క్వాడ్ ఎల్ఈడీ అండ్ జూమ్ ఫ్లాష్, కెమెరా ఐలాండ్‌తోపాటు 13 మెగా పిక్సెల్ డ్యుయల్ కెమెరా సెటప్, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం ఎల్ఈడీ ఫ్లాష్, స్క్రీన్ ఫ్లాష్‌తోపాటు 8మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటుంది.



# పేటీఎంకు నకుల్ జైన్ గుడ్ బై..!
## త్వరలోనే కొత్త సీఈవోను ప్రకటిస్తామన్న కంపెనీ..!



పేటీఎం పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ సీఈవో నకుల్ రాజీనామా చేశారు. ఆయన సొంతంగా వ్యాపార ప్రయాణం మొదలపెట్టనున్నారు. ఈ క్రమంలో పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ సీఈవో పదవి నుంచి వైదొలిగారు. ఈ విషయాన్ని స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. ఆయన స్థానంలో సీఈవోను నియమించేందుకు సరైన వ్యక్తి కోసం అన్వేషిస్తున్నామని.. త్వరలోనే కొత్త పేరును ప్రకటిస్తామని పేర్కొంది. ఈ క్రమంలోనే పేటీఎం పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ వృద్ధిని కొనసాగించడంతో పాటు వ్యాపార లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించినట్లు కంపెనీ తెలిపింది. ఫిన్‌టెక్ కంపెనీ చెల్లింపు చెల్లింపు అగ్రిగేటర్ లైసెన్స్ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆమోదం కోసం నిరీక్షిస్తున్న సమయంలోనే నకుల్ సీఈవో పదవికి రాజీనామా చేశారు. నవంబర్ 2022లో ఎఫ్‌డీఐ నిబంధనలు పాటించనందుకు పీటీఎం దరఖాస్తును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరస్కరించిన విషయం తెలిసిందే. ఆగస్టు 2024లో పీపీఎస్ఎల్ దిగువ పెట్టుబడులకు పేటీఎం ప్రభుత్వం నుంచి ఆమోదం పొందింది. ఆ తర్వాత కంపెనీ తిరిగి పీఏ లైసెన్స్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకుంది. ఓ వైపు ఆర్‌బీఐ అప్రూవల్ కోసం ఎదురుచూస్తునే.. ప్రస్తుత ఆన్‌లైన్ వ్యాపారులకు చెల్లింపు సేవలను అందిస్తూనే ఉంటుందని పేటీఎం పేర్కొంది.




# చైనీస్ డీప్‌సీక్ యాప్ సంచలనం..
## అమెరికా కంపెనీలకు ట్రంప్ వార్నింగ్

**న్యూయార్క్:** డీప్‌సీక్ యాప్.. అమెరికాలో సంచలనం సృష్టిస్తోంది. చైనాకు చెందిన ఆ కొత్త తరహా ఏఐ యాప్.. వారం క్రితమే మార్కెట్లోకి రిలీజైంది. కానీ ఆ యాప్ అమెరికా మార్కెట్ తో పాటు ప్రపంచదేశాల్లో మార్కెట్లను షేక్ చేస్తున్నది. డీప్‌సీక్ టెక్నాలజీ.. అమెరికా టెక్నాలజీ పరిశ్రమకు మేల్కొల్పులాంటిదని దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. లేజర్ ఫోకస్‌తో కాంపిటీషన్‌పై దృష్టి పెట్టి విజయం సాధించాలని ట్రంప్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు చెందిన డీప్‌సీక్ యాప్ తన ప్రత్యర్థులను వెనక్కి నెట్టేసింది. చాట్ జీపీటీని కూడా డీప్‌సీక్ యాప్ వెనక్కి నెట్టేసింది. అమెరికాలో అత్యధిక సంఖ్యలో ఫ్రీగా డౌన్‌లోడ్ చేసిన యాప్‌గా డీప్‌సీక్ నిలిచింది. డీప్‌సీక్ టెక్నాలజీతో.. అమెరికా ఏఐ ఇండస్ట్రీ ఆందోళనకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. తక్కువ ఖర్చుతో తయారైన డీప్‌సీక్ ఏఐ యాప్‌తో.. అమెరికా స్టాక్‌మార్కెట్‌లో ప్రకంపనలు వచ్చాయి. వాల్‌స్ట్రీట్ వణికిపోయింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో మేటిగా భావించిన ఎన్విడియా కంపెనీ షేర్లు దారుణంగా పడిపోయాయి. ఒక్కసారిగా ఆ కంపెనీ 500 బిలియన్ల డాలర్లు కోల్పోయింది.

# బ్యాంకింగ్ షేర్ల కొనుగోలుతో..
# లాభాల్లోకి దూసుకెళ్లిన సూచీలు..



దేశీయ బెంచ్ మార్క్ సూచీలు మంగళవారం లాభాల్లో ట్రేడయ్యాయి. బ్యాంకింగ్ వ్యవస్థలోకి నిధులను జొప్పించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పలు చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.60వేలకోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీస్‌ను మూడు విడుతల్లో బహిరంగ మార్కెట్ క్యాపిటల్ ద్వారా కొనుగోలు చేయనున్నది. జనవరి 30న తొలి విడుతలో రూ.20వేలకోట్లు సెక్యూరిటీ కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ఆ తర్వాత ఫిబ్రవరిలో మరో రెండు విడుతల్లో కొనుగోలు చేయనున్నట్లు చెప్పింది. ఈ క్రమంలో మార్కెట్ బ్యాంకింగ్ స్టాక్స్ భారీ కొనుగోళ్లతో ప్రారంభయ్యాయి. ప్రారంభంలోనే సెనెక్స్ 323.76 పాయింట్లు, నిఫ్టీ 77 పాయింట్లకుపైగా లాభంతో మొదలైంది. సెన్సెక్స్ గత సెషన్‌తో పోలిస్తే 75,659.00 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 75,622.88 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 76,512.96 పాయింట్లకు పెరిగింది. చివరకు 535.23 పాయింట్లు పెరిగి.. 75,901.41 వద్ద ముగిసింది. నిఫ్టీ 128.1 పాయింట్లు పెరిగి.. 22,957.25 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,116 షేర్లు లాభపడగా.. 2,429 షేర్లు పతనమ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం తగ్గగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.7 శాతం పడిపోయింది. నిఫ్టీలో యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్ నిఫ్టీలో ప్రధాన లాభాలను ఆర్జించాయి. సన్ ఫార్మా, బ్రిటానియా ఇండస్ట్రీస్, ఐషర్ మోటార్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టీ నష్టపోయాయి. ఆటో, బ్యాంక్, రియాల్టీ సూచీలు ఒకటి నుంచి 2శాతం పెరిగాయి. పవర్, మెటల్, చమురు, గ్యాస్, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్, ఐటీ షేర్లు 0.5శాతం నుంచి ఒకశాతం వరకు తగ్గాయి.

# ఐదేండ్లలో రెండింతలు.. క్రెడిట్ కార్డులకు
# పెరిగిన డిమాండ్: రిజర్వుబ్యాంక్




**ముంబై :** దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డుల సంఖ్య అమాంతం పెరిగింది. గడిచిన ఐదేండ్లలో కార్డుల సంఖ్య రెండింతలు పెరిగినట్లు రిజర్వుబ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. డిసెంబర్ 2019లో 5 కోట్లుగా ఉన్న క్రెడిట్ కార్డులు ప్రస్తుతం 10.80 కోట్లకు చేరుకున్నాయని, ఇదే సమయంలో డెబిట్ కార్డులు మాత్రం యథాతథంగా ఉన్నాయని పేర్కొంది. అలాగే డిజిటల్ చెల్లింపులు కూడా రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. ఐదేండ్ల క్రితం 80.53 కోట్లుగా ఉన్న డెబిట్ కార్డులు ప్రస్తుతం 99.08 కోట్లకు చేరుకున్నాయి.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





# కుంభమేళాకు వెళ్లే రైలుపై రాళ్లతో దాడి..
## డోర్లు ఓపెన్ చేయడం లేదని అటాక్

**చతర్‌పూర్:** ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న కుంభమేళారైళ్లపై అటాక్ జరిగింది. మధ్యప్రదేశ్‌లోని చతర్‌పూర్ రైల్వే స్టేషన్‌లో ఆగిన ట్రైన్‌పై ప్రయాణికులు రాళ్లతో దాడి చేశారు. ట్రైన్ లోపల ఉన్న ప్రయాణికులు డోర్లు తీయడం లేదని.. ఫ్లాట్ ఫామ్‌పై ఉన్న వ్యక్తులు అసహనంతో దాడి చేశారు. మంగళవారం ఈ ఘటన జరిగింది. చతర్‌పూర్, హర్పల్‌పూర్ రైల్వే స్టేషన్లలో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ మేరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు అధికారులు చెప్పారు. చతర్‌పూర్, హర్పల్‌పూర్ స్టేషన్లలో రైలు ఆగిన సమయంలో కొందరు ప్రయాణికులు ఆగ్రహంతో రైలుపై దాడి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్లాట్‌ఫామ్‌పై ఉన్న ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేసిన తర్వాత రైల్వే పోలీసు అధికారులు డోర్లు ఓపెన్ చేశారు. కానీ అప్పటికే రైలు కిక్కిరిసిపోవడం వల్ల ఫ్లాట్‌ఫామ్‌పై ఉన్న ప్రయాణికులు చాలా మంది రైలు ఎక్కలేకపోయారు. రైళ్లపై దాడి జరిగిన ఘటన గురించి తమకు సమాచారం అందినట్లు జాన్సీ రైల్వే డివిజన్ పీఆర్వో మనోజ్ కుమార్ సింగ్ తెలిపారు.

# మల్లికార్జున్ ఖర్గేపై కోర్టులో ఫిర్యాదు..!






### కుంభమేళా స్నానాలపై వ్యాఖ్యానించిన మల్లికార్జున విశ్వాసాన్ని దెబ్బతీశారంటూ పేర్కొన్న న్యాయవాది ఫిబ్రవరి 3న విచారించనున్న కోర్టు

**మహా:** కుంభమేళా స్నానాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ బీహార్‌లోని ముజఫర్‌పూర్ కోర్టులో ఫిర్యాదు దాఖలైంది. స్థానిక న్యాయవాది సుధీర్ ఈ ఫిర్యాదు చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మనోభావాలను దెబ్బ తీశారని, రాజకీయ లాభం కోసం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు సనాతన హిందువుల మనోభావాలతో ఆటలాడారన్నారు, ఖర్గే వ్యాఖ్యలు హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయంటూ ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిబ్రవరి 3న కోర్టు విచారించనుంది. ఫిర్యాదులో మతపరమైన మనోభావాలను దెబ్బతీయడంతో పాటు ప్రజాశాంతికి భంగం కలిగించినట్లు ఆయన ఆరోపించారు. అయితే, ఈ ఫిర్యాదుపై కాంగ్రెస్ అధ్యక్షుడు స్పందించలేదు. ఇదిలా ఉంటే... కుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో సోమవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్నానం చేశారు. దీనిపై మల్లికార్జున్ ఖర్గే స్పందిస్తూ గంగానదిలో స్నానం చేయడం వల్ల పేదరికం అంతమవుతుందా? అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు కెమెరాల కోసం స్నానం చేసేందుకు పోటీపడుతున్నారంటూ ఖర్గే ఆరోపించారు. మోవ్‌లో జరిగిన 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్' ర్యాలీలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, తాను ఎవరి విశ్వాసాలను ప్రశ్నించడం లేదన్న ఆయన.. తన వ్యాఖ్యలు ఎవరినైనా బాధిస్తే క్షమాపణలు చెబుతున్నానని కూడా అన్నారు. పిల్లలు ఆకలితో చనిపోతున్నారని.. పాఠశాలలకు వెళ్లడం లేదని.. కార్మికులకు జీతాలు అందడం లేదన్న ఆయన.. వేలాది రూపాయలు ఖర్చు చేసి గంగానదిలో స్నానం చేసేందుకు పోటీపడుతున్నారన్నారు. దేవుడిపై తనకు నమ్మకం ఉందన్న ఆయన.. మతం పేరుతో పేదలను దోపిడీ చేయడాన్ని సహించబోమంటూ ఖర్గే వ్యాఖ్యలు చేశారు.



# 30 రోజుల పెరోల్‌పై రిలీజైన గుర్మీత్ రామ్ రహీమ్

**చండీఘడ్:** దేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్.. హర్యానాలోని రోహతక్ జైలు నుంచి రిలీజయ్యాడు. అతనికి 30 రోజుల పెరోల్ మంజూరీ చేశారు. సిర్సాలో ఉన్న దేరా ప్రధాన కార్యాలయానికి ఆయన వెళ్లిపోయారు. రోహతక్‌లోని సునరియా జైలులో గుర్మీత్ శిక్ష అనుభవిస్తున్నారు. రేప్ కేసులో నిందితుడైన గుర్మీత్ 2017లో జైలుకు వెళ్లాడు. అయితే జైలు నుంచి బయటకు వచ్చి.. సిర్సాలోని కార్యాలయానికి ఆయన మొదటిసారి వెళ్లారు. గతంలో పేరోల్ తీసుకున్నప్పుడు అతను యూపీలోని భాగ్‌పాత్‌లో ఉన్న ఆశ్రమంలో ఉండేవారు. ఈసారి 10 రోజులు సిర్సాలో ఆ తర్వాత మిగితా రోజులన్నీ భాగ్‌పాత్‌లో ఉండనున్నట్లు తెలుస్తోంది. దేరాను విజిట్ చేయరాదు అని ఆయన ఓ వీడియోను రిలీజ్ చేశారు. ఇద్దరు భక్తుల్ని రేప్ చేసిన కేసులో గుర్మీత్ 20 ఏళ్ల జైలుశిక్ష అనుభవిస్తున్నాడు. గత ఏడాది అక్టోబర్‌లో ఆయనకు 20 రోజుల పాటు పెరోల్ ఇచ్చారు. అప్పుడు హర్యానా అసెంబ్లీ ఎన్నికల ముందు పెరోల్ ఇవ్వగా, ఈసారి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ముందు పెరోల్ మంజూరీ చేశారు.

# మహాకుంభమేళా వేళ.. అయోధ్యకు పోటెత్తుతున్న భక్తులు..
# ఒక్క రోజే 25 లక్షల మంది దర్శనం

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకొనసాగుతోంది. గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. మహాకుంభమేళా వేళ యూపీలోని ప్రఖ్యాత ప్రదేశం అయోధ్యకు కూడా భక్తులు పోటెత్తుతున్నారు. అయోధ్య రామ మందిరాన్ని సందర్శిస్తున్నారు. ముఖ్యంగా జనవరి 26గణతంత్ర దినోత్సవం రోజున అయోధ్యలోని రామ మందిరాన్ని 25 లక్షల మందికిపైగా భక్తులు సందర్శించినట్లు ఆలయ ట్రస్ట్ తెలిపింది. భక్తులు రామ్ లల్లాతోపాటు హనుమాన్‌గర్హి ఆలయాన్ని సందర్శిస్తున్నట్లు పేర్కొంది. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు వస్తున్న భక్తులు అటునుంచి అయోధ్యకు వస్తున్నట్లు తెలిపింది. కాగా, భక్తుల రాకతో అయోధ్యా నగరి రద్దీగా మారింది. మరోవైపు రానున్న రోజుల్లో అయోధ్యకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రద్దీ దృష్ట్యా రామ మందిరం, హనుమాన్ గర్హి ఆలయాల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించింది.

**15 కోట్ల మంది పుణ్య స్నానాలు**

త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్ల సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివస్తున్నారు. ఇప్పటికే 15 కోట్ల మంది మహాకుంభ్‌లో అమృత స్నానాలు చేశారు. అయితే రేపు మౌనీ అమావాస్య సందర్భంగా .. కుంభమేళాకు ఒక్క రోజే సుమారు పది కోట్ల మందికిపైగా వచ్చే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీని కోసం యూపీ సర్కారు భారీగా ఏర్పాట్లు చేస్తున్నది. గడిచిన 17 రోజుల్లో ప్రతి రోజూ సుమారు కోటి మంది వరకు పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. బుధవారం మౌనీ అమావాస్య కోసం భారీ ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వం పేర్కొన్నది.



## తొలిసారి సీనియర్ హీరోతో..



సోషల్ మీడియాలో ఎప్పటికపుడు కొత్త కొత్తగా ట్రెండీ లుక్‌లో మెరిసిపోతూ అభిమానులు, ఫాలోవర్లకు నిద్రపట్టకుండా చేస్తుంది మలబారు సోయగం మాళవిక మోహనన్. ఈ బ్యూటీ ప్రస్తుతం గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్‌తో కలిసి రాజాసాబ్ సినిమాలో నటిస్తుందని తెలిసిందే. తొలిసారి తెలుగులో నటిస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. తాజాగా ఈ భామకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ బ్యూటీ కెరీర్‌లో తొలిసారి ఓ సీనియర్ హీరోతో రొమాన్స్ చేసేందుకు రెడీ అయింది. మాళవిక మోహనన్ మాలీవుడ్ స్టార్ యాక్టర్ మోహన్‌లాల్ హృదయపూర్వంలో హీరోయిన్‌గా ఫైనల్ అయిందని ఇండస్ట్రీ సర్కిల్ సమాచారం. మాళవిక మోహనన్ ఓ సీనియర్ హీరోతో రొమాన్స్ చేయడం ఇదే తొలిసారి కావడంతో సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రాన్ని సత్యన్ అంథిక్కడ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీలో సంగీత, సిద్దిఖీ, సంగీత్ ప్రతాప్, నిషాన్, లలు అలెక్స్, జనార్ధనన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 10 నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది.

## ఏం చేయడానికైనా సిద్ధమేనా అని అడిగారు



సినీ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ అంశం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. అవకాశాల కోసం వెళ్లినప్పుడు, చిత్రీకరణ సమయంలో కొందరు తారలు కాస్టింగ్ కౌచ్‌కు గురవుతున్నారు. తమకు ఎదురైన ఆ చేదు అనుభవాలను ఏదో ఒక సందర్భంలో బయటపెడుతున్నారు. తాజాగా సౌత్ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ గురించి బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్ షాకింగ్ కామెంట్స్ చేశారు. అమీర్ ఖాన్ నటించిన 'దంగల్' సినిమాతో తెరంగేట్రం చేసిన ఫాతిమా సనా షేక్ తన కెరీర్ తొలినాళ్లలో ఎదురైన కాస్టింగ్ కౌచ్ అనుభవాలను ఓ ఇంటర్వ్యూలో తాజాగా పంచుకున్నారు. 'ఓ సినిమా కోసం ఆడిషన్‌కు వెళ్లాను. అక్కడ మీరు ఏం చేయడానికైనా సిద్ధమేనా..? అంటూ ఓ డైరెక్టర్ నన్ను అడిగాడు. కష్టపడి పనిచేస్తానని.. నా పాత్ర కోసం ఏది అవసరమో అది చేస్తానని చెప్పా. కానీ, అతను మాత్రం అదే ప్రశ్న మళ్లీ మళ్లీ అడిగాడు. నేను కూడా అతడు ఎంతకు దిగజారతాడో చూద్దామని ఏమీ తెలియనట్లే ప్రవర్తించాను' అని ఫాతిమా తనకు ఎదురైన చేదు అనుభవం గురించి తెలిపింది. ఇక సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రొడ్యూసర్లు కాస్టింగ్ కౌచ్ గురించి ఓపెన్‌గా మాట్లాడుకుంటారని నటి పేర్కొంది. దక్షిణాది సినిమాలో అవకాశం కోసం హైదరాబాద్‌కు వచ్చినప్పుడు తనకు ఎదురైన ఓ అనుభవాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంది. హైదరాబాద్‌లో ఓ నిర్మాతను కలిసిన అనుభవాన్ని పంచుకుంటూ.. 'నిర్మాతలు కాస్టింగ్ కౌచ్ గురించి చాలా ఓపెన్‌గా మాట్లాడతారు. మీకు తెలుసా.. ఇక్కడ మీరు కొందరిని కలవాల్సి ఉంటుంది అనేవాళ్లు. ఆ విషయం నేరుగా చెప్పేవాళ్లుకాదు. ఎలా చెప్పినా వారి ఉద్దేశమైతే అదే అని తెలిసిపోయేది' అని ఫాతిమా చెప్పుకొచ్చారు. నటి కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

## విప్లవం ఎవరి కోసం వేచి ఉండదు



### క్యూరియాసిటీ పెంచుతోన్న శివకార్తికేయన్ ఎస్‌కే 25 లుక్

కోలీవుడ్ యాక్టర్ శివకార్తికేయన్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి సుధా కొంగర డైరెక్షన్‌లో రాబోతున్న ఎస్‌కే 25. పీరియాడిక్ ఫిల్మ్‌గా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ప్రీ లుక్ రూపంలో బయటకు వచ్చింది. విప్లవం ఎవరి కోసం వేచి ఉండదు.. విప్లవానికి రేపు నాంది పలుకబోతున్నాం.. అంటూ శివకార్తికేయన్ సీసాకు మంటలంటిస్తున్న ప్రీ లుక్ ఒకటి విడుదల చేశారు. ఈ మూవీ అనౌన్స్‌మెంట్ టీజర్ రేపు సాయంత్రం 4 గంటలకు ఉండబోతున్నట్టు ప్రకటించారు. శివకార్తికేయన్ ఏదో సరికొత్త పాయింట్‌ను తీసుకురాబోతున్నాడని ఈ లుక్‌తో అర్థమవుతోంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా.. జయం రవి, అధర్వ మురళి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## తారక్, హృతిక్ రోషన్ వార్ 2లో మహేశ్ బాబు.. క్రేజీ టాక్‌లో నిజమెంత..?



గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ స్టార్ యాక్టర్ హృతిక్ రోషన్ కాంబోలో వస్తోన్న ప్రాజెక్ట్ వార్ 2. అయాన్ ముఖర్జీ డైరెక్షన్‌లో స్పై జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీలో బాలీవుడ్ భామ కియారా అద్వానీ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీ గురించి ఆసక్తికర వార్త రౌండప్ చేస్తోంది. మూవీ లవర్స్, అభిమానులకు థ్రిల్లింగ్ ట్విస్ట్ ఇచ్చేలా టాలీవుడ్ స్టార్ యాక్టర్ మహేశ్ బాబు కూడా ఈ సినిమాలో భాగం కాబోతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. అయితే ఇందులో మహేశ్ బాబు నటించడం లేదని, వార్ 2 తెలుగు వెర్షన్‌కు వాయిస్ అందించబోతున్నాడని బీటౌన్ సర్కిల్ టాక్. అంతేకాదు హిందీ వెర్షన్‌కు రణ్‌బీర్ కపూర్ వాయిస్ అందించబోతున్నాడట. దీనిపై అధికారిక ప్రకటన రావడమే తరువాయి అని తెలుస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే వార్ 2 జూనియర్ ఎన్టీఆర్‌మహేశ్ బాబు కాంబోలో రాబోతున్న రెండో సినిమా కానుంది. మహేశ్ బాబు ఇప్పటికే తారక్ నటించిన బాద్ షా సినిమాకు వాయిస్ ఓవర్ అందించాడని తెలిసిందే. ఇప్పటికే మేకర్స్ షేర్ చేసిన వార్ 2 గ్లింప్స్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీని 2025 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.

# క్రీడా వార్తలు | SPORTS NEWS

## ఢిల్లీ రంజీ జట్టులోకి చేరిపోయిన కోహ్లీ..
### అరుణ్ జైట్లీ స్టేడియంలో ప్రాక్టీస్



ఇటీవల పేలవ ఫామ్‌తో సర్వత్రా విమర్శలు ఎదుర్కొంటున్న భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ.. ఇప్పుడు తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. ఇందులో భాగంగానే దేశవాళీలలో పుష్కరకాల సుదీర్ఘ విరామానికి తెరదించుతూ రంజీ బరిలోకి దిగబోతున్నాడు. రైల్వేస్‌తో ఈనెల 30న ప్రారంభం కానున్న మ్యాచ్‌లో ఈ పరుగుల వీరుడు ఢిల్లీ తరఫున ఆడేందుకు సిద్ధమయ్యాడు. ఇందులో భాగంగానే తాజాగా ఢిల్లీ రంజీ జట్టులోకి కోహ్లీ చేరిపోయాడు. ముంబై నుంచి నేరుగా ఢిల్లీకి చేరుకున్న విరాట్ కోహ్లీ.. ఢిల్లీ రంజీ జట్టులోకి చేరిపోయాడు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ప్రాక్టీస్ కూడా మొదలు పెట్టాడు. గ్రూప్ రన్నింగ్, ఫీల్డింగ్ డ్రిల్స్‌లో పాల్గొన్నాడు. ఆటగాళ్లతోకలిసి ఫుట్‌బాల్ ఆట కూడా ఆడాడు. కాగా, కోహ్లీ 2012లో చివరిసారిగా దేశవాళీల్లో ఆడిన విషయం తెలిసిందే. దేశవాళీకి రీఎంట్రీలో భాగంగా కొంతకాలంగా తనను వేధిస్తున్న బ్యాక్‌ఫుట్, ఆఫ్ సైడ్ ఆఫ్ స్టంప్ బలహీనతల నుంచి బయటపడేందుకు గాను విరాట్.. ఆర్సీబీ మాజీ కోచ్ సంజయ్ బంగర్ సమక్షంలో తీవ్రంగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. సోమవారం కూడా కోహ్లీ.. ముంబైకి సమీపంలో ఉన్న అలీభాగ్ వద్ద బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు.

## అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో అదరగొట్టిన తెలంగాణ అమ్మాయి త్రిష

ఐసీసీ వుమెన్స్ అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష అదరగొట్టింది. మంగళవారం స్కాట్‌లాండ్‌తో జరిగిన సూపర్ సిక్స్ మ్యాచ్‌లో కేవలం 53 బంతుల్లోనే అజేయ సెంచరీ సాధించి రికార్డును నెలకొల్పింది. వుమెన్స్ అండర్-19 ప్రపంచ కప్‌లో సెంచరీ సాధించిన తొలి వుమెన్స్ క్రికెటర్‌గా నిలిచింది. అదే సమయంలో బంతితోనూ రాణించి మూడు వికెట్లు పడగొట్టింది. మలేషియాలో జరుగుతున్న అండర్-19 వరల్డ్ కప్ సూపర్ సిక్స్ మ్యాచ్‌లో స్కాట్‌లాండ్‌తో టీమిండియా తలపడింది. స్కాట్లాండ్ టాస్ గెలిచి ఫీల్డ్ ఎంచుకుంది. ఓపెనర్లు కమలిని, గొంగడి త్రిష చెలరేగి ఆడారు. ఓపెనర్లు కమలినీ, త్రిష గొంగాడి బౌండరీలతో స్కోర్ బోర్డును పరుగులెత్తించారు. పవర్‌ప్లే ముగిసే సమయానికి భారత్ 67-0తో బలమైన స్కోరును సాధించింది. పది ఓవర్లు ముగిసే వరకు భారత్ వికెట్ నష్టపోకుండా 104 పరుగులతో చేసింది. ఓపెనర్లు ఇద్దరు కలిసి ప్రపంచ కప్‌లో అత్యధిక పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. తొలి వికెట్‌కు ఇద్దరు అజేయంగా 147 పరుగులు జోడించారు. మ్యాచ్‌లో ముఖ్యంగా తెలంగాణ అమ్మాయి త్రిష 59 బంతుల్లోనే 110 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. 13 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో స్కాట్లాండ్ బౌలర్లపై విరుచుకుపడింది. కమిలిని 42 బంతుల్లో 51 పరుగులు చేయగా.. మరో బ్యాట్స్‌వుమెన్ సానికా చల్కే 20 బంతుల్లో 29 పరుగులు చేసింది. ముగ్గురు చెలరేగడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఆ తర్వాత భారీ విజయలక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ 58 పరుగులకే కుప్పకూలింది. టీమిండియా బ్యాటర్లు చెలరేగి ఆడగా.. బౌలర్లు స్కాట్లాండ్‌ను బౌలింగ్‌తో వణికించారు. ఆయుషి శుక్లా మూడు ఓవర్లు వేసి 8 పరుగులు ఇచ్చి కీలకమైన నాలుగు వికెట్లు పడగొట్టింది. వైష్ణవి శర్మ ఐదు పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీయగా.. గొంగడి త్రిష రెండు ఓవర్లు వేసి.. ఆరు పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసింది.







కివీస్ ఆల్‌రౌండర్‌కు

## మాకొద్దు ఈ ప్రైజ్‌మనీ



**బెంగళూరు:** అరంగేట్రం ఖో ఖో ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యులైన తమ రాష్ట్ర ప్లేయర్లకు ఇచ్చిన ప్రైజ్‌మనీపై కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నది. ఇటీవలే ముగిసిన ఖో ఖో వరల్డ్‌కప్ టైటిల్ సాధించిన భారత జట్లలో సభ్యులైన ఎమ్‌కే గౌతమ్, చైత్రకు సీఎం సిద్ధరామయ్య 5 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకం ప్రకటించారు. దీనిపై అటు ప్లేయర్లతో పాటు ప్రతిపక్ష పార్టీలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. ఇదే ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యులైన తమ ప్లేయర్లకు మహారాష్ట్ర ప్రభుత్వం 2.25కోట్ల ప్రైజ్‌మనీతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తున్నట్లు ప్రకటించింది. అలాంటిది కర్నాటక ప్రభుత్వం తమకు ఏదో ముష్టి వేసినట్లు 5లక్షలు ఇచ్చి అవమాన పరిచిందని ప్లేయర్లు వాపోయారు. మహారాష్ట్ర ప్రభుత్వం అంత ఇవ్వకపోయినా కనీసం గుర్తింపు అయినా ఇవ్వాలని ప్లేయర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. మీరిచ్చిన ప్రైజ్‌మనీ తమకు వద్దని వారు సున్నితంగా తిరస్కరించారు. దీనిపై అటు ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వ తీరుపై విరుచుకుపడ్డాయి. ఇచ్చినప్పుడు తీసుకోవడం బెటర్ లేకపోతే ఇవి కూడా మళ్లీ దొరకవంటూ సెటైర్లు వేస్తున్నారు.

## ఐసీసీ వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ మెలీ కెర్‌ను.. ఐసీసీ వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వరించింది. ప్రతిష్టాత్మకమైన రేచల్ హేహో ఫ్లింట్ ట్రోఫీకి ఆమె ఎంపికైంది. 2024లో అద్భుతమైన మహిళా క్రికెటర్‌గా ఆమె రికార్డుకెక్కింది. క్రికెట్‌కు చెందిన మూడు ఫార్మాట్లలో కెర్ గత ఏడాది అద్భుత ప్రదర్శన ఇచ్చింది. రేచల్ హేహో ఫ్లింట్ అవార్డు కోసం లౌరా వోల్వార్డ్, చామరి ఆటపట్టు, అన్నాబెల్ సుదర్‌లాండ్ పోటీపడ్డారు. కానీ కివీస్ క్రికెటర్‌ను ఆ అవార్డు వరించింది. మూడు ఫార్మాట్లలోనూ ఆమె వరల్డ్‌క్లాస్ ఆల్‌రౌండర్‌గా నిలిచింది. ప్రపంచంలోని మేటి మహిళా లెగ్ స్పిన్ బౌలర్‌గా కెర్ కీర్తికెక్కింది. బ్యాటింగ్‌లోనూ కివీస్ లైనప్‌ను మరింత పటిష్టం చేసింది. మిడిల్ ఆర్డర్‌లో బలమైన బ్యాటర్‌గా కీలక ఇన్నింగ్స్ ఆడింది. రేచల్ హేహో ఫ్లింట్ ట్రోఫీ అవార్డును 2017 నుంచి ప్రకటిస్తున్నారు. ఎలిసీ పెర్రీ (ఆస్ట్రేలియా), స్మృతి మంధాన (ఇండియా), స్కీవర్ బ్రంట్ (ఇంగ్లండ్) ఇప్పటి వరకు ఈ అవార్డును గెలుచుకున్నారు. రేచల్ అవార్డును గెలుచుకున్న తొలి కివీస్ ప్లేయర్‌గా కెర్ నిలిచింది. ఐసీసీ మహిళా క్రికెటర్ అవార్డును కూడా గెలవడం కివీస్ క్రికెటర్‌కు ఇదే మొదటిసారి. 2024లో 9 వన్డేలు ఆడిన కెర్.. వాటిల్లో 33 సగటుతో 264 రన్స్ చేసింది. ఆ ఫార్మాట్‌లో 14 వికెట్లు కూడా తీసింది. టీ20 మ్యాచుల్లో అద్భుత ప్రదర్శన ఇచ్చిన కెర్... 18 మ్యాచుల్లో 387 రన్స్ స్కోర్ చేసింది. ఆ తర్వాత 29 వికెట్లను కూడా తీసుకున్నది. మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో అత్యధికంగా 15 వికెట్లు తీసుకున్నది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

# ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలనుకాపాడుకోవాలి



ప్రొద్దుటూరు డి.ఎస్పీ పి.భావన

**కడప, మహా :** హెల్మెట్ రక్షణ కవచమని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని ప్రొద్దుటూరు డి.ఎస్పీ పి.భావన సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా రహదారి ప్రమాదాల నివారణ లక్ష్యంగా డి.ఎస్పీ పి.భావన ఆధ్వర్యంలో మంగళవారం ప్రొద్దుటూరు పట్టణంలో పోలీసు అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు, మహిళా పోలీసులు, వాలంటీర్లతో కలిసి హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి, ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ యొక్క ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారని, వాటి వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుండి తమను తాము కాపాడుకోవాలని సూచించారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరించారు. హెల్మెట్ ధరించని వారిపై కఠినంగా చట్టం ప్రకారం జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని, హెల్మెట్ ధరించటం ద్వారా మీ భద్రత మరియు మీ కుటుంబం యొక్క సంతోషం గురించి ఆలోచించాలని ప్రొద్దుటూరు డి.ఎస్.పి శ్రీమతి పి.భావన గారు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మల్లిఖార్జున, ట్రాఫిక్ సి.ఐ దేవకిరణ్, ప్రొద్దుటూరు వన్ టౌన్ సి.ఐ రామకృష్ణారెడ్డి, టూ టౌన్ సి.ఐ యుగంధర్, త్రీ టౌన్ సి.ఐ గోవింద రెడ్డి, ఆర్టీవో మురళి, మహిళా పోలీసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ పై చేతులెత్తేసిన చంద్రబాబు

- హామీలు అమలు చేయమంటే సాకులు చెబుతున్న బాబు.. ప్రజా సమస్యలు గాలికి వదిలి జూదంలో మునిగితేలుతున్న పులివెందుల టిడిపి నేతలు
- కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి ఫైర్





**కడప , మహా:** బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పై చంద్రబాబు చేతులెత్తేస్తున్నట్లు క్లారిటీగా చెబుతున్నారని, ఇచ్చిన హామీలు అమలు చేయలేమని సాకులు వెతుక్కుంటున్నారని కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి ఫైరయ్యారు. సింహాద్రిపురం మండలం చిన్నకూడాలలో కార్యకర్త రామకృష్ణారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎంపి వై ఎస్ అవినాష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చే సమయానికి 5 లక్షల కోట్ల అప్పులు, బడ్జెట్లో 100 కోట్లు మాత్రమే ఉన్నాయన్నారు. కానీ వైఎస్ జగన్ మాత్రం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని, చంద్రబాబులా సాకులు చెప్పలేదన్నారు. కోవిడ్ తో రాబడి తగ్గిన ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని, చంద్రబాబు మాత్రం అధికారంలోకి వచ్చాక హామీల అమలు చేయ్యలేనని సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రజలు వైఎస్ జగన్ పాలనకు చంద్రబాబు పాలనకు తేడాను గమనించాలని కోరుతున్నానని చెప్పారు. కడప జిల్లాలోని ప్రొద్దుటూరు జమ్మలమడుగు పులివెందులలో అధికార పార్టీ అండదండలతో జూదం విపరీతంగా పెరిగిపోయిందని, జూదం అడ్డు అదుపు లేకుండా పెరగడంతో చోరీలు పెరిగిపోయాయని, ఎంతో మంది రోడ్డున పడ్డారన్నారు. పులివెందుల ప్రాంతంలో అయితే జూదానికి అలవాటుపడిన వారు ట్రాన్స్ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్నారని, ఇటీవల ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్ఫార్మర్లు కూడా చోరీకి గురయ్యాయన్నారు. కానీ ఈ ట్రాన్స్ఫార్మర్లు ఏమయ్యాయో కూడా పట్టించుకోనే పరిస్థితుల్లో అధికార పార్టీ నాయకులు లేరని, అధికార పార్టీ నాయకులు జాదంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. స్థానిక అధికార పార్టీ నాయకులకు కావాల్సిందల్లా ముగ్గురాయి దొంగతనం చేశామా? పేకాట ఆడిస్తున్నామా? వైసీపీ కార్యకర్తలపై దాడి చేస్తున్నామా? మాత్రమేనన్నారు. ఏ ఒక్క సమస్యపైనా దృష్టి సారించటం లేదని, అరటి ధర ఆశాజనకంగా ఉందని, కానీ నీరు లేక రైతులు నీరు కావాలని అడుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అధికార పార్టీ నాయకులు పేకాట, ముగ్గురాయి చోరీల్లో బిజీగా ఉండొచ్చు గానీ కొంచెం స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని, తక్షణం మోటార్లు తెప్పించి రైతులకు నీరిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



# 35 వేల కేజీల గంజాయి దగ్ధం

డైరెక్టర్ జనరల్ పోలీస్ సిహెచ్ ద్వారకా తిరుమలరావు

**అనకాపల్లి జిల్లా ,పరవాడ, మహా :** 35 వేల కేజీల గంజాయి దగ్ధం చేశామని డైరెక్టర్ జనరల్ పోలీస్ సిహెచ్ద్వారకా తిరుమలరావు. తెలిపారు.అనకాపల్లి జిల్లా ద్వారా స్వాధీనం చేసుకున్న సుమారు 35000.వేల కిలోల గంజాయిని మంగళవారం ధ్వంసం చేశారు పరవాడ మండలం జోహార్ లాల్ నెహ్రూ ఫార్మాసిటీ రామ్ కి కోస్టల్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్ పరవాడ గంజా డిస్ట్రక్షన్ ప్రోగ్రాం కు డైరెక్టర్ జనరల్ పోలీస్ సిహెచ్ ద్వారకా తిరుమలరావు ఐపిఎస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలన కమిటీ ద్వారా నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే గంజాయి నిర్మూలనకు కమిటీ ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ జనరల్ఆఫ్ పోలీస్. ఈగల్ టాస్క్ ఫోర్స్ ఆకే రవికృష్ణ ఐపీఎస్ ,డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ఆఫ్ పోలీస్ గోపీనాథ్ జట్టి ఐపిఎస్.,సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ అనకాపల్లి డిస్ట్రిక్ట్ తుహని సిన్హా ఐపిఎస్ లు పాల్గొన్నారు.

# ఏపీలో మరో భారీ స్కామ్ తెరపైకి.. గోల్డ్ గోల్‌మాల్



**మహా :** ఏపీలో మరో భారీ స్కామ్ తెరపైకి వచ్చింది. కనక దుర్గ గోల్డ్ ఫైనాన్స్‌కు కోట్లలో కుంభకోణం జరిగింది. చిత్తూరు, అనంతపురం జిల్లాలోని కనక దుర్గ గోల్డ్ ఫైనాన్స్ బ్రాంచ్‌లో పది కోట్ల స్కామ్ జరిగినట్టు తేలింది. మిగత బ్రాంచ్‌ల్లోనూ ఇదే దగానా?కస్టమర్ల ఒరిజినల్ నగలను సైతం మాయం చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.చిత్తూరు, అనంతపురం జిల్లాలోని కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ లో అదే జరిగింది. ఆఫీసులో దొంగలు పడలేదు... కానీ నకిలీ బంగారంలో బడా గోల్‌మాల్‌కు తెరలేపిన ఇంటి దొంగల వ్యహారం ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఏపీగా మారింది. చిత్తూరు జిల్లా పుంగనూరు, పలమనేరులో కనకదుర్గా గోల్డ్ లోన్స్ సంస్థకు ఉద్యోగులే పంగనామాలు పెట్టారు. తమ బంధువుల, స్నేహితుల ద్వారా నకిలీ బంగారం తనఖా పెట్టించి ఎడాపెడా లోన్లు ఇచ్చేశారు. చెక్ చేస్తే ఆడిట్‌లో 8 కోట్ల స్కామ్ బయటపడింది. సిబ్బంది సహా 26 మందిపై కేసు ఫైల్ చేశారు పోలీసులు. మరోవైపు అనంతపురం జిల్లా ఉరవకొండలోని కనక దుర్గ గోల్డ్ ఫైనాన్స్‌లోనూ సేమ్ టు సేమ్ స్కామ్ తెరపైకి వచ్చింది. కంపెనీ మేనేజర్, సిబ్బంది కుమ్మక్కై నకిలీ బంగారం తాకట్టు పెట్టి 56 లక్షల నగదు నొక్కేశారు. కంపెనీ ఆడిట్‌లో అసలు విషయం బయటపడింది. కనక దుర్గ గోల్డ్ ఫైనాన్స్ ప్రతినిధుల ఫిర్యాదుతో బ్రాంచ్ మేనేజర్ ప్రశాంత్ కుమార్ , అసిస్టెంట్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఆడిటర్ రామాంజనేయులు, మేనేజర్లు జ్వాలా చంద్రశేఖర్ రెడ్డి, గురునాథ్ రెడ్డిలపై కేసు ఫైల్ చేశారు ఉరవకొండ పోలీసులు. ఆడిట్‌లో అసలు బాగోతం బయటపడినా... ఎలాగోలా నకిలీ బంగారం ప్లేస్‌లో ఒరిజనల్ గోల్డ్ నగలు పెట్టి కవర్ చేయాలని ట్రై చేశారట. కానీ పుంగనూరు, పలమనేరులోని కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్‌లో 8 కోట్ల స్కామ్ బయటపడ్డంతో చివరాఖరకు పోలీసులను ఆశ్రయించారు. కనక దుర్గ గోల్డ్ ఫైనాన్స్ కంపెనీ హెడ్డాఫీస్ విజయవాడలో వుంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 60 కేంద్రాల్లో కార్యకలాపాలు గోల్డ్ ఫైనాన్స్ నిర్వహిస్తోంది. పలమనేరు, పుంగనూరు, ఉరవకొండలో ఇంటి దొంగల చేతివాటం బయటపడింది. మరి మిగతా బ్రాంచ్‌ల్లోనూ ఇదే కథా?. కంపెనీకి మస్కా కొట్టి గిల్టు నగలతో కోట్లు కొల్లగొట్టడం వరకే దగా జరిగిందా? కస్టమర్లు తాకట్టు పెట్టిన ఒరిజినల్ నగలను కూడా గాయబ్ చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటు పోలీసులు.. అటు కంపెనీ యాజమాన్యం ఆ దిశగా ఎంక్వయిరీ ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది.

# సంపూర్ణ అక్షరాష్యత లక్ష్యంగా కృషి చేద్దాం

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి



**కడప , మహా :** వయోజన విద్య ఉల్లాస్ కార్యక్రమం ద్వారా సంపూర్ణ అక్షరాష్యత లక్ష్యంగా కృషి చేద్దామని కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి అన్నారు. కమలాపురం నగర పంచాయతీ లో నూతన వసతులతో ఆధునికరణ చేసిన మండల కార్యాలయంను రిబ్బన్ కట్ చేసిన ప్రారంభించిన అనంతరం అంగన్వాడి కేంద్రంలో వయోజన విద్యాశాఖ ఉల్లాస్ కార్యక్రమాన్ని అయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాగా చదువుకొంటే ఎవరూ మోసం చేయలేరు మీరు మోసపోరన్నారు. మీ స్వశక్తితో మీరు నిలబడే విధంగా అక్షరాస్యత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి ఉల్లాస్ అనే కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ చదువుకొని వెసులుబాటు కల్పించిందన్నారు. మీకు నచ్చిన సమయంలో మీరు ఎంచుకున్న స్థలానికే విద్యా వాలంటరీ ద్వారా ప్రతి ఒక్కరిని చదువుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## పులివెందులలో పోలీసులు వేధిస్తున్నారని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**కడప, మహా :** పోలీసుల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ ఎదుట జరిగింది. పులివెందుల మండలం మొట్నూతలపల్లె గ్రామానికి చెందిన గంగాధర్ పోలీసులు వేధిస్తున్నారంటూ స్టేషన్ ఎదుట పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో పోలీసులు అతడిని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరారయ్యాడు. గంగాధర్ ఓ వివాహేతర సంబంధం కేసులో ముద్దాయిగా ఉన్నట్లు, ఓ మహిళను పదేపదే వేధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గంగాధర్ పై కేసు పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

# త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ

- పాతవారికి ఎక్కువ ప్రిఫరెన్స్..
- కష్టపడినవారికే పదవులు



**ఏపీ , మహా:** నామినేటెడ్ పదవుల విషయమై ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నవారికి సీఎం చంద్రబాబు శుభవార్తా చెప్పారు. జూన్ లోపు ప్రభుత్వంలో ఉన్న అన్ని నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన వారికంటే.. ఎప్పటి నుంచో పార్టీలో ఉండి పనిచేసిన వారిని నేతలు ప్రోత్సహించాలన్నారు. మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న వారికే పదవులు దక్కేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని సీఎం సూచించారు. రాష్ట్రంలో మొత్తం 214 మార్కెట్ కమిటీలు, 1100 ట్రస్ట్ బోర్డులు ఉన్నాయని, రానున్న రోజుల్లో ఆ నియామకాలన్నిటినీ పూర్తి చేస్తామంటూ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, పార్టీ ఇన్‌ఛార్జ్‌లతో మంగళవారం సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... పదవి పొందిన వాళ్ల రెండేళ్ల పనితీరుపై సమీక్ష చేస్తామన్నారు. వారి ప్రొగ్రెస్ ఆధారంగా మళ్లీ నిర్ణయాలు, భవిష్యత్ అవకాశాలు ఉంటాయని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల నియామకంపై ఎమ్మెల్యేలు సరైన ప్రతిపాదనలు పంపాలన్నారు. కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేసేలా నామినేటెడ్ పదవులు ఇస్తామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలు, నేతల పనితీరు వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు.

## గద్దర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బండి సంజయ్ భేషరతుగా క్షమాపణ చెప్పాలి



ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి.

**మేడిపల్లి, జనవరి 28, మహా:** కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రజా యుద్ధ నౌక గద్దర్ ను అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలను బండి సంజయ్ వెనక్కి తీసుకుని భేషరతుగా క్షమాపణ చెప్పాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర లు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం బద్దం ఎల్లారెడ్డి భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర లు సంయుక్తంగా మాట్లాడుతూ సాహిత్య కళారూపం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలకంగా ప్రజలను చైతన్య పరుస్తూ పోరాడిన యుద్ధ నౌక గద్దర్ పై అర్థరహితంగా బండి సంజయ్ మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు.



## సూపర్ సిక్స్ పథకాల పై సిఎం చంద్రబాబు మాట తప్పారు

- ఇచ్చిన మాట తప్పడంలో చంద్రబాబు దిట్ట
- ఎన్నికల సమయంలో ప్రజలకు మాయ మాటలు చెప్పారు
- మాజీ డిప్యూటి సిఎం అంజాద్ బాష

**కడప , మహా :** సూపర్ సిక్స్ పథకాల పై సిఎం చంద్రబాబు మాట తప్పారని, ఇచ్చిన మాట తప్పడంలో చంద్రబాబు దిట్టని మాజీ డిప్యూటి సిఎం అంజాద్ బాష మండిపడ్డారు. కడపలో మీడియాతో మాట్లాడిన ఆయన ఎన్నికల సమయంలో ప్రజలకు మాయ మాటలు చెప్పారని, అధికారంలోకి వచ్చాక ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏం అయ్యాయి ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన 7 నెలల్లో ఎన్ని హామీలు నెరవేర్చారు ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.ప్రపంచానికి పాఠాలు చెప్పానని గొప్పలుచెప్పే చంద్రబాబు..ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలియదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా అని, ఆర్థిక పరిస్తితి తేలిసి కూడా చంద్రబాబు ఎలా హామీలు ఇచ్చారని మండిపడ్డారు. చంద్రబాబు మాట్లాడుతున్న ప్రతి మాట అసత్యాలేనని, కరోనా లాంటి కష్ట కాలంలో కూడా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సిఎం జగన్ మాత్రమేనన్నారు. సంక్షేమ క్యాలెండర్ పెట్టీ ప్రతి నెలా సంక్షేమ పథకాలు అందించామని, దళారి వ్యవస్థ లేకుండా, లంచం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించామన్నారు. చంద్రబాబు మాత్రం తక్షణం తన వైఖరి మార్చుకుని హామీల అమలు చెయ్యాలని, లేనిపక్షంలో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

# సీఎం ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

మరోసారి ఉప్పల్ నియోజకవర్గంకు భారీగా నిధులు



**మేడిపల్లి, జనవరి 28, మహా:** ఉప్పల్ నియోజకవర్గంలో ఏండ్లుగా పెండింగ్ లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సమస్యల పనులకు మోక్షం లభించనుంది. నియోజక వర్గంలో అన్ని డివిజన్లలో ఉన్న సమస్యలను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో చర్లపల్లి, కాప్రా డివిజన్ల కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి స్వర్ణరాజ్, తో కలిసి హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి ఎండీ అశోక్ రెడ్డి, ఐ ఏ ఎస్ తో సమావేశం అయ్యారు. సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో పెండింగ్ పనులు, కొత్త డ్రైనేజీల నిర్మాణం వేగవంతం చేసేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సీఎం చొరవతో భారీగా నిధులు కేటాయించి, ఉప్పల్ నియోజకవర్గంలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు ముగింపు పడుతుందని పరమేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎంకు ఉప్పల్ నియోజకవర్గ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాప్రా డివిజన్, గోపాల్ రెడ్డి నగర్, రాజీవ్ ఎనక్లేవ్, బ్యాంకు కాలనీ, చలసాని హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్, కాప్రా డివిజన్ అధ్యక్షులు నాగ శేషు, పడమటి మల్ల రెడ్డి, నాగరాజ్, కిషోర్, సందీప్, పూర్ణ యాదవ్, రాకేష్ యాదవ్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

# మీర్ పేట్ ఆర్మీ జవాన్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

**ఎల్బీనగర్, జనవరి 28,మహా:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మీర్ పేట్ హత్య కేసులో మీర్ పేట్ పోలీసులు నిందితుడు గురుమూర్తిని అరెస్ట్ చేశారు. హత్యకు గల కారణం పెద్దగా ఎం లేనప్పటికీ చిన్న గోడవల కారణంగానే తన బార్య పుట్ట వెంకటమాదవిని ముందస్తు ప్రణాళిక ప్రకారం హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. హత్య అనంతరం శిక్ష పడకుండా ఉండేందుకే ఆదారాలు దొరకకుండ చేయాలనే తన బార్యను ముక్కలు ముక్కలుగా చేసి డిస్పోజల్ చేశాడు.ఈ కేసు వివరాలను ఎల్బీనగర్ లోని రాచకొండ సిపి క్యాంపు ఆఫీస్ లో సిపి సుధీర్ బాబు తెలిపారు.ఏపీ ప్రకాశం జిల్లా జెపి చెరువుకు చెందిన పుట్ట గురుమూర్తి(39) అదే ప్రాంతానికి చెందిన పుట్ట వెంకటమాధవి(35)కి గత 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది.వీరికి ఒక కొడుకు(12),కూతురు(10) ఉండగా వీరు మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెలగూడలోని న్యూ వెంకటేశ్వర కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు.15ఏళ్ల పాటు ఆర్మీలో జవాన్ గా పనిచేసి గత మూడేళ్ల క్రితం రిటైర్ అయ్యి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా డీఆర్ డిఎల్ లో పనిచేస్తున్నాడు.వెంకటమాధవి ఇంట్లోనే ఉంటుంది .కాగా గత కొంత కాలం నుండి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి.కాగా ఈ గొడవల నేపథ్యంలో తన వెంకటమాధవిని హత్య చేయాలని గురు`మూర్తి డిసైడ్ అయ్యాడు.ఈ సంక్రాంతి సందర్భంగా వెంకటమాదవి దగ్గరి బంధువులు స్థానికంగా బడంగ్ పేట్ లో ఉంటుండగా వారి ఇంటికి గురుమూర్తి, వెంకటమాదవి తమ పిల్లలు ఇద్దరితో కలిసి ఈ నెల 14న వెళ్లారు.తిరిగి 15 రాత్రి 11గంటలకు న్యూ వెంకటరమణ కాలనీలోని తమ ఇంటికి భార్యాభర్తలు వచ్చారు. అప్పటికే ముందుగా డిసైడ్ అయిన విధంగా 16న ఉదయం లేవగానే 6గంటలకు గురుమూర్తి తన భార్యతో ఉద్దేశ్యంపూర్వకంగా అకారణంగా గొడవకు దిగాడు.ఆ తర్వాత ఆమెపై దాడి చేశాడు. గోడకు బలంగా బాదడంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది.ఆమె మృతి చెందినట్లు నిర్ధారించుకున్న గురుమూర్తి ఈ నేరం తనపై రావొద్దని ఈ కేసును డైవర్ట్ చేయాలని అనుకున్నాడు. పోలీసులు హత్య అని గుర్తించినా ఆదారాలు దొరకకుండా చేయాలని ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం డెడ్ బాడీని దొరకుండా చేయాలని అనుకున్నాడు.డెడ్ బాడీని బాత్ రూంలోకి తీసుకెల్లి మొదట కళ్ళు ఆ తర్వాత చేతులు మెడ వేరు చేశాడు. ఎముకల నుండి మాంసం వేరు చేశాడు. ఆ తర్వాత మాంసం ముద్దలను చిన్న చిన్న ముక్కలుగా చేసి చేసిన ముక్కలను ఓ బకెట్ లో వేసి హీటర్ సాయంతో బాయిల్ చేశాడు.ఆ నీటిని బాత్ రూమ్ లో వేసి ప్లెష్ చేశాడు. ఆ తర్వాత ఆ ఫీస్ లను స్టవ్ పై కాలుస్తూ బొగ్గుగా మార్చాడు.ఆ బొగ్గును ఫీసులను కూడా బాత్ రూమ్ లో ప్లస్ చేశాడు.వేరు చేసిన బోన్స్ ను రోలు,రొకలి తో దంచి పిండిగా మార్చాడు.ఎక్కడ కూడా అనుమానం రాకుండా,ఆధారాలు లభించకుండా రూమ్ మొత్తం డిటర్జెంట్ ,పినాయిల్ ,యాసిడ్ తో క్లీన్ చేశాడు. పక్కకు పేట్టుకున్న బోన్ పిండిని జిల్లెలగూడ సందే చెరువులో కలిపేశాడు. అక్కడి నుండి అటుగా బడంగ్ పేట్ కు వెళ్లి తన పిల్లలను తమ ఇంటికి తీసుకువచ్చాడు. ఇంట్లోకి రాగానే తమ పిల్లలకు ఎదో స్మెల్ వస్తుందని,అమ్మ ర ఎక్కడని అడగగా ఆమె తప్పుడు పని చేసి ఇంట్లో నుండి వెళ్ళిపోయింది వారికి నమ్మపలికాడు.ఇదే విషయాన్ని తన మేన మామకు చెప్పాడు.18న తన కూతురు కోసం ఆమె పేరెంట్స్ కాల్ చేయగా కనిపించడం లేదని చెప్పాడు.దీంతో వారు మీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు చేసే సమయంలో ఆమె పేరెంట్స్ తో కలిసి ఏమీ ఎరగనట్లు పోలీస్ వెళ్లాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు.సిసి కెమెరాలను పరిశీలించి ఆ దిశగా దర్యాప్తు చేశారు. 10గంటల్లోనే డెడ్ బాడీ డిస్పోజల్...ఇల్లు క్లీన్... జనవరి 15న తమ ఇంట్లోకి వెంకటమాదవితో కలిసి గురుమూర్తి రాగా ఆ తర్వాత ఫిర్యాదులో పేర్కొన్న విధంగా ఇంట్లో నుండి వెంకటమాధవి బయటకు వెళ్లినట్లు ఎక్కడ కెమెరాలో రికార్డ్ అవ్వలదు.

మహా పత్రిక
ANN తెలుగు
ఆంధ్రప్రదేశ్ వార్తలు
05
AP NEWS
బుధవారం, హైదరాబాద్ | 29-01-2025
WWW.MAHAADAILY.COM




## అరసవిల్లి రథసప్తమి వేడుక ఉత్సవానికి
# పటిష్ట భద్రత చర్యలు

- రథసప్తమి వేడుకలు సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ
- జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి, ఐపిఎస్

**శ్రీకాకుళం, జనవరి 28, మహా:** శ్రీకాకుళం పట్టణంలో ఫిబ్రవరి 2,3,4 తేదీలలో మూడు రోజుల పాటు జరిగే ప్రత్యక్ష దైవం అరసవల్లి శ్రీ సూర్య నారాయణ స్వామివారి రథసప్తమి వేడుకలు కు చేపట్టే భద్రత, బందోబస్తు ఏర్పాట్లు,అవసరమగు పోలీసు ఫోర్స్, సిబ్బంది కేటాయింపు తదితర అంశాలపై జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి, ఐపిఎస్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి వేడుకలు కు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున రథసప్తమి వేడుక రోజుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా,శాంతియుతంగా నిర్వహించే విధంగా భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మూడు రోజులు పాటు జరిగే ఉత్సవాలు నిరంతరం సీసీటీవీ, డ్రోన్ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలన్నారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలీసు సిబ్బంది,అధికారులు సమన్వయం చేసుకుంటూ వేడుక ప్రశాంతంగా నిర్వహణకు ప్రతిష్ట చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులతో సంప్రదించి వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగు ప్రాంతాలను, లైటింగు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా పట్టణంలోకి పెద్ద వాహనాలను రాకుండా అవసరమైన ప్రదేశాల్లో ట్రాఫిక్ మళ్ళింపులు చేపట్టాలన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో సూర్య నమస్కారాలు,శోభయాత్ర,క్రీడాలు, హెలికాప్టర్ ఎగ్జిబిషన్,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశాల్లో ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. శ్రీ సూర్యనారాయణ స్వామివారిని భక్తులు ప్రశాంతంగా దర్శనాలు చేసుకొనే విధంగా ఎండోమెంటు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని, క్యూ లైన్లను వంపేందుకు భారీకెడ్లు ఏర్పాటు,ఎటువంటి పిక్ పాకెట్స్ జరగకుండా క్రైం బృందాలను నియమించాలన్నారు. వృద్ధులు,దివ్యాంగులు, బాలింతలకు దర్శనానికి అవసరమైన సేవలందించేందుకు స్వచ్ఛంద సేవకులు సేవలు ఉపయోగించాలన్నారు. రథసప్తమి రోజున పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ముఖ్య కూడళ్ళలో బ్యారికేడింగు ఏర్పాటు చేయాలన్నారు. దర్శన టికెట్ కౌంటర్లు, ప్రసాదం విక్రయ కేంద్రాలు,పార్కింగు ప్రాంతాలు ప్రజలకు తెలిసే విధంగా సూచిక బోర్డులను సంబధిత అధికారులతో సంప్రదించి ఏర్పాటు చేయాలన్నారు. శాంతియుతంగా,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రణాళిక రూపొందించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.వేడుకలు ప్రశాంతయుతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలు, మార్పులు,సాధ్య సాధ్యాలను అధికారులతో జిల్లా ఎస్పీ సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీలు కెవి రమణ పి. శ్రీనివాసరావు,డిఎస్పీ వివేకానంద్,అప్పారావు, ప్రసాద్ రావు, శేషాద్రి, జిల్లాలోని సిఐలు,ఆర్ఐ, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

# కళల జాతర రథసప్తమి వేడుక

- ఫిబ్రవరి 3న ఆర్ట్స్ కళాశాల వేదిక
- ప్రవేశం ఉచితం.. అందరూ ఆహ్వానితులే

**శ్రీకాకుళం , మహా :** రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర పండుగగా ప్రకటించిన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి కోసం జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈనెల 3వ తేదీన నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రాథమికంగా ప్రకటించారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 10:30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాలను వీక్షించేందుకు ప్రవేశం ఉచితం. పార్కింగ్ కోసం కోడి రామ్మూర్తి స్టేడియంను సిద్ధం చేస్తున్నారు. ఆర్ట్స్ కళాశాలలో ఫుడ్ స్టాల్స్ కూడా అందుబాటులో ఉంటాయి. వివిధ రంగాలకు చెందిన కళాకారులు ఈ వేడుకలలో ప్రదర్శనలు ఇవ్వనున్నారు. క్లాసికల్ సంగీతం, నృత్యం, ఫోక్ డ్యాన్స్, వెస్ట్రన్ డ్యాన్స్ వంటి అనేక రకాల కార్యక్రమాలు జరుగుతాయి. పెద్ద ఎత్తున బాణాసంచా వెలుగులతో కార్యక్రమాలు ముగుస్తాయి. ప్రముఖ గాయకులు మంగ్లీ, జాతీయస్థాయి సంగీత కళాకారులు, నర్తకులు ఈ వేడుకకు హాజరవుతున్నారు. ప్రాథమికంగా ఖరారైన ఆ కార్యక్రమాల వివరాలిలా ఉన్నాయి. ఫిబ్రవరి మూడో తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ బృందం సినీ లైట్ క్లాసికల్ మ్యూజిక్ తో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి . 3.15 గంటలకు దుంప ఈశ్వర్ ఆధ్వర్యంలో సినీ క్లాసికల్ మ్యూజిక్, 3.30నుంచి యామిని కృష్ణ ఆధ్వర్యంలో క్లాసికల్ వోకల్ ప్రదర్శన ఉంటుంది. 3.45 నుంచి 4 గంటల వరకు పరిమళ గ్రూప్ ఆధ్వర్యంలో క్లాసికల్, ఫోక్ డాన్స్, 4.00 గంటల వరకూ శ్రీమతి అనురాధ ఆధ్వర్యంలో క్లాసికల్ డాన్స్, 4.15 నుంచి 4.45 వరకు సుందరంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సాక్సోఫోన్ సంగీత ప్రదర్శన ఉంటాయి. 4.45 నుంచి మావుదూరు శ్రీనివాస శర్మ క్లాసికల్ వయోలిన్, 5.15 గంటలకు లక్ష్మి గణపతి శర్మచే సినీ క్లాసికల్ మ్యూజిక్, 5.45 కు నీరజ సుబ్రహ్మణ్యం తో క్లాసికల్ డాన్స్, 6.00 గంటలకు రఘుపాత్రుని శ్రీకాంత్ క్లాసికల్ డాన్స్, 6.30కి సాంప్రదాయం కూచిపూడి గురుకులం యోగ డాన్స్, 7.00కి సభా కార్యక్రమం లెజర్ షో, 8.00కి జోష్ శివ వెస్ట్రన్ డాన్స్, 8.15కి ప్రముఖ గాయని మంగ్లీ బృందంతో సిని మ్యూజిక్, 10.15కి పెద్ద ఎత్తున బాణాసంచా వెలుగులతో కార్యక్రమం ముగిస్తుంది.

## అందరి సహకారంతో ప్రశాంతంగా ముగిసిన
## శ్రీ శంబర పోలమాంబ అమ్మవారి సిరిమానోత్సవం

- పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ శ్రీ ఎస్.వి.మాధవ్ రెడ్డి

**పార్వతీపురం మన్యం జిల్లా, మహా :** శంబర పోలమాంబ అమ్మవారి సిరిమానోత్సవం కన్నుల పండుగగా జనవరి 28, సాయంత్రం ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ చేపట్టిన పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు, ముందస్తు భద్రత, జాగ్రత్త చర్యలు సత్ఫలితాలిచ్చాయి. సిరిమాను వెంబడి జిల్లా అదనపు ఎస్పీ ఓ. దిలీప్ కిరణ్,పార్వతీపురం ASP అంకిత సురాన,IPS, ఏఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి గార్లు తిరిగి, సిరిమాను కార్యక్రమం ముగిసినంత వరకు దగ్గరగా వుండి బందోబస్తు ఏర్పాట్లును స్వయంగా పర్యవేక్షించారు. సిరిమానోత్సవం ముగిసిన తరువాత భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రధాన కూడళ్ళలో బ్యారికేడ్లును ఒక క్రమ పద్ధతిలో తొలగించి, వారు అన్ని మార్గాలలో వెళ్ళేందుకు అనుమతించారు. పోలీసుశాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీసు సేవాదళ్ దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణిలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండాకు విశేషమైన సేవలందించి, ప్రజల మన్ననలు పొందింది. సిరిమానోత్సవం అనంతరం సిబ్బంది విధుల నుండి వెళ్ళిపోకుండా పోలీసు అధికారులు చర్యలు చేపట్టి, తమకు కేటాయించిన స్థానం వద్దనేవుండి ట్రాఫిక్ రెగ్యులేషన్కు ప్రత్యేక చర్యలను పోలీసుశాఖ చేపట్టడం కూడా సత్ఫలితాలిచ్చింది.సిరిమానోత్సవం సజావుగా, ప్రశాంత వాతావరణంలో ముగియుటకు అన్ని వర్గాల ప్రజల తమ వంతు సహకారాన్ని పోలీసుశాఖకు అందించారని జిల్లా ఎస్పీ గారు అన్నారు. విద్యుత్, అటవీ, ఆరోగ్య,పారిశుద్యం, పంచాయతి, ఫైర్, రెవెన్యూ, దేవాదాయ మరియు ఇతర శాఖలు సమన్వయంతో పని చేసాయన్నారు. అదే విధంగా ప్రజలు, పాత్రికేయులు, ఇతర జిల్లాల నుండి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బంది తమ వంతు సహకారాన్ని జిల్లా పోలీసుశాఖకు అందించారని, వారందరికి జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, ధన్యవాదాలు తెలిపారు. ఎటువంటి దొంగతనాలు జరగకుండా భక్తులను పోలీసుకంట్రోల్ రూం నుండి సిసి కెమెరాలను పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు సంబంధిత పోలీసు అధికారులను అప్రమత్తం చేయడం, మఫ్టీలో పోలీసులు (క్రైమ్ పార్టీ) పహారా కాయడం, అనుమానితులను చెక్ చేసి, వారు పాత నేరస్థులా? కాదా? అన్న విషయం నిర్ధారణ కావడంతో ఎటువంటి దొంగతనాలు జరగలేదు. అన్ని ముఖ్య కూడళ్ళలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను తాత్కాలిక ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కు అనుసంధానం చేయడంతో సిసి ఫుటేజులను కమాండ్ కంట్రోల్ నుండే జిల్లా ఎస్పీ గారితో పాటుగా అదనపు ఎస్పీ,ఏఎస్పీ పర్యవేక్షించారు. సిసి కెమెరాల ఫుటేజులు పరిశీలించి, రద్దీని బట్టి, మార్గాలను మళ్ళించడం జరిగింది. అదనపు ఎస్పీ ఓ. దిలీప్ కిరణ్,పార్వతీపురం ASP అంకిత సురాన,IPS మరియు డిఎస్పీలు బందోబస్తును పర్యవేక్షించి ఆయా ప్రాంతాలలో విధులు నిర్వహించే పోలీసు అధికారులను అప్రమత్తం చేయడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడగలిగామని, పోలీసుశాఖకు సహకరించిన యావన్మంది ప్రజానీకానికి జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, ప్రత్యేక ధన్యవాదాలను తెలిపారు.

# సామాన్య జనంలో దివ్యాంగులు కూడా ఒక భాగమే

- దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణికి అర్హత గుర్తింపు
- ఎయిర్ పోర్టు అధారిటీ ఆఫ్ ఇండియా వారి సి.యస్.ఆర్ ఫండ్స్ సహకారముతో
- కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు





**శ్రీకాకుళం, మహా:** ఎయిర్ పోర్టు అధారిటీ ఆఫ్ ఇండియా వారి సి.యస్.ఆర్ ఫండ్స్ సహకారముతో దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలను పంపిణీ చేయడం జరుగుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మంగళవారం శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి అర్హత గుర్తింపు కార్యక్రమం జిల్లా పరిషత్ సమావేశలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ తో కలసి ముఖ్య అతిధిగా హాజరైయారు. కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ శిబిరానికి హాజరైన దివ్యాంగుల వద్దకు వెళ్లి వారి నుండి వినతులు స్వీకరించి వారి సమస్యలు సత్వారం పరిష్కరించేదిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. సుమారు రూ 50 లక్షల రూపాయల ఎయిర్ పోర్టు అధారిటీ ఆఫ్ ఇండియా వారి సి.యస్.ఆర్ ఫండ్స్ ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సమానంగా అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కూడిన ఆప్టిమైజ్డ్ వర్క్‌ఫ్లోలు, అత్యంత నైపుణ్యం కలిగిన వర్క్‌ఫోర్స్ తయారీ సౌకర్యాలతో అధిక నాణ్యత గల పరికరాలను అర్హులను గుర్తించి అందివ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి సదా అందుబాటులో ఉంటామన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు అందరూ కలసి ఈ కార్యక్రమని నిర్వహించడం జరుగుతుందన్నారు. పలాస, టెక్కలి, శ్రీకాకుళం డివిజన్లలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. త్రిచక్ర, బ్యాటరీ వాహనాలు కావాలని చాలా వరకు దరఖాస్తులు వస్తున్నాయన్నారు. గతంలో అలింకో వారి సహకారంతో రెండుసార్లు క్యాంపులు నిర్వహించడం జరిగిందని అందుకు ఎం పి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గతంలో పలువురి కోరిక మేరకు వికలాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, అందున వస్తున్న వినతులు సత్వరం పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పించే ఈ సదవకాశం దివ్యంగుల పాలిట గొప్ప వరం అన్నారు. దివ్యాంగులకు వారి అవసరం మేరకు వైద్య నిపుణుల ద్వారా అర్హతను గుర్తించి వారికి అవసరమైన కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు,మూడు చక్రాల సైకిల్, వాకింగ్ స్టిక్స్, తదితర ఉపకరణాలను మంజూరు చేయడం జరుగుతుందని, ఈ కార్యక్రమం ఎయిర్ పోర్టు అధారిటీ ఆఫ్ ఇండియా వారి సి.యస్.ఆర్ ఫండ్స్ సహకారముతో నిర్వహించడం జరుగుతున్నదన్నారు. అర్హత గుర్తించిన ఒకటిన్నర నెలలోపు పూర్తి స్థాయిలో ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ అవయవ లోపాలున్న దివ్యంగులకు కృత్రిమ అవయవ పరికరాలు, సహాయక ఉపకరణాలను అందించే బృహత్తర కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టిందన్నారు. ఒక మంచి ఆలోచనకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కార్యరూపమే ఎయిర్ పోర్టు అధారిటీ ఆఫ్ ఇండియా వారి సి.యస్.ఆర్ ఫండ్స్ సహకారం అన్నారు. జిల్లాలో ఉన్న దివ్యంగులు అందరూ.. ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి అర్హత గుర్తింపు కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ ఏడి కవిత, కార్యాలయ సిబ్బంది వివిధ మండలాల నుండి విభిన్న ప్రతిభావంతులు హాజరైయారు.

## ఈ నెల 30న ఎంజీఎంలో గుండెవ్యాధి నిర్ధారణ పరీక్షలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గోపాలరావు

**ములుగు, మహా :** ఆర్ బిఎస్ కె డీఈఐసి ఆధ్వర్యంలో ఈ నెల 30న వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో హైదరాబాద్ అపోలో వైద్య నిపుణులతో గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు ములుగు జిల్లా వైద్యాధికారి గోపాల్ రావు తెలిపారు. గుండె సంబంధిత అనారోగ్య సమస్యల నిర్ధారణ పరీక్షలను ఆర్ బిఎస్ కె డీ ఈఐసి ఎంజీఎంలో ఉదయం 9.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు చేస్తారని, గుండె సంబంధ (పుట్టుకతో గుండెలో రంధ్రం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గుండె వేగంగా కొట్టుకోవడం, గుండె శబ్దంలో మార్పులు, అప్పుడప్పుడు కండ్లు తిరిగి పడిపోవడం, ఛాతిలో నొప్పి, బరువు పెరగకపోవడం) సమస్యలతో బాధ పడుతున్నవారు ఈ క్యాంపుకు సందర్శించాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదాల నివారించుటకు చేపట్టాల్సిన చర్యలు

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మహా:** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నివారించుటకు నేషనల్హై వే ఆర్ అండ్ బి అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,సమీక్ష సమావేశం నిర్వహించడమైనది.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. జనవరి 26 న ఖమ్మం నేషనల్ హైవే పైన జరిగిన ప్రమాదం ఓవర్ లోడ్ మరియు డ్రైవర్ డ్రింక్ చేసి ఉన్నందున ప్రమాదం జరిగిందని, అలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు కాషన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని,ప్రమాద తరచూ జరుగుచున్నందున ఖమ్మం హైవే నుండి 7 కిలోమీటరు మేర నాలుగు లైన్లు రోడ్డుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆర్ అండ్ బి మరియు నేషనల్ అధికారులకు సూచించారు. రోడ్డు పక్కల నో షాపింగ్..నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు తో పాటు ప్రమాద సూచికల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిపి రవీందర్, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, నేషనల్ హైవే పీడి దివ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పోలీసుల అత్యుత్తమ
# పనితీరు అభినందనీయం

- ప్రజలకు పారదర్శకంగా మెరుగైన పోలీసు సేవలు అందించాలి
- గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- గంజాయి మూలాల పై ఉక్కు పాదం
- అవగాహన తోనే సైబర్ నేరాల నియంత్రణ
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి శ్రీ ద్వారక తిరుమల రావు ఐ.పీ.యస్ గారు.

**శ్రీకాకుళం, మహా :** జిల్లాలో పోలీసుల అత్యుత్తమ పనితీరు అభినందనీయం అని జిల్లా పోలీసు అధికారుల, సిబ్బంది పనితీరు ప్రశంసించి,ప్రజలకు పారదర్శకంగా మెరుగైన పోలీసు సేవలు అందించి జిల్లా, రాష్ట్ర పోలీసు శాఖ యొక్క కీర్తి ,పేరు ప్రతిష్టలు పెంపొందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి శ్రీ ద్వారక తిరుమల రావు ఐపియస్ గారు పోలీసు అధికారులు ను సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం రాష్ట్ర గౌరవ డిజిపి శ్రీ ద్వారకా తిరుమలరావు గారు శ్రీకాకుళం జిల్లాకు విచ్చేశారు. ఈ క్రమంలో ముందుగా జిల్లా పోలీసు కార్యాలయంలోని రాష్ట్ర డిజిపి వారిని విశాఖపట్నం రేంజ్ డీఐజీ సిహెచ్ గోపీనాథ్ జట్టి, జిల్లా ఎస్పీ శ్రీ కేవీ మహేశ్వర్ రెడ్డి,జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా,జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. ఈ సంధర్బంగా ఆర్టిసి ఒకట,రెండవ డిపోల గ్యారేజ్లను సందర్శించి సిబ్బందితో మమేకమయ్యారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాల్లో గల పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ కేవీ మహేశ్వర్ రెడ్డి జిల్లాలో నేరాల నమోదు నియంత్రణకు చేపడుతున్న చర్యలు ప్రాపర్టీ నేరాలలో టెంపెల్, చైన్




స్నాచర్ల, ట్రాన్స్ఫార్మర్, బీహార్ సుఫారి తదితర గ్యాంగ్ కేసులు, నేరస్తులు , ప్రాపర్టీ ఛేదింపు ,జిల్లాలో సంకల్పం పేరిట గంజాయి,సైబర్ నేరాలు,నియంత్రణ, మహిళలు,మైనర్ బాలికలపై జరుగుతున్న నేరాలు అరికట్టుట,రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు ద్వార నేరాలు నియంత్రణకు ప్రతిష్ట చర్యలు చేపట్టడం జరిగిందని,ఈ క్రమంలో గత ఏడాదిలో 17% నేరాలు తగ్గాయని, జిల్లాలో 460 సీసీ కెమెరాలు పని చేస్తున్నాయని,సురక్ష కార్యక్రమాల్లో 520 సీసీ కెమెరాలు ఇప్పటివరకు అదనంగా ఏర్పాటు చేశామని,డ్రోన్ ఉపయోగం పెరిగింది అని,రథ సప్తమి బందోబస్తు ఏర్పాట్లు,అరోగ్య రక్ష క్రింద జిల్లా పోలీసులు కు ఆరోగ్య పరీక్షలు చేయించి, డిజిటల్ హెల్త్ కార్డుల జారీ చేయడం జరిగిందని, తద్వారా ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు అని ఈ సందర్భంగా డిజిపి వారికి జిల్లా ఎస్పీ పై వివరాలు తెలియజేశారు.

### పచ్చదనానికి ప్రతీకగా:-

**పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనానికి ప్రతీకిగా జిల్లా పోలీస్ కార్యాలయంలో రాష్ట్ర డీజీపి వారు కొబ్బరి మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు పి.శ్రీనివాసరావు, కెవి రమణ, డీఎస్పీలు, సీఐలు,విజయ నగరం జొన్ ఈడి ఏ విజయ కుమార్, విశాఖపట్నం రీజియన్ ఆర్.ఎం బి. అప్పల నాయుడు ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు**

## పరిమితికి మించి ప్రయాణాలపై అవగాహన కల్పిస్తున్నాం

జిల్లా రవాణా శాఖాధికారి టి. దుర్గాప్రసాద్ రెడ్డి

**పార్వతీపురం, మహా :** పరిమితికి మించి జీపు, ఇతర వాహనాల్లో ప్రయాణించడం వలన కలిగే రహదారి ప్రమాదాలపై సాలూరు ఇంధన శకట తనిఖీదారు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గా ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కోటియా పరిధిలోని ప్రజలు జీపుల పైభాగంలో కూర్చొని, వెనుక నిల్చొని ప్రయాణించడం వలన కలిగే నష్టాలపై తెలియజేస్తునట్లు చెప్పారు. అలాగే జీపు యజమానులు, డ్రైవర్లకు పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణించడం వలన కలిగే రోడ్డు ప్రమాదాల గురించి వివరిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 22వ తేదీన ప్రమాదకరం... తప్పని ప్రయాణం శీర్షికన ఒక పత్రికలో వచ్చిన వార్తకు ఆయన స్పందిస్తూ కోటియా పరిధిలో ఆర్.టి.సి.బస్ సౌకర్యం లేనందున, నంద గ్రామం వరకు ఉదయం, సాయంత్రం ఒక్క బస్సే ఉన్నందున జీపుల పై భాగంలో కూర్చొని, వెనుక నిల్చొని వేలాడుతూ రావాల్సిన పరిస్థితి వస్తుందని గ్రామస్తులు తెలిపారన్నారు. ఆర్.టి.సి మరిన్ని బస్సులను ఏర్పాటుచేస్తే బాగుంటుందని కోటియా గ్రామ పరిధి ప్రజలు కోరుతున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.



## గిరిజన అభివృద్ధికే. జి.సి.సి

**పార్వతీపురం మన్యం జిల్లా , మహా:** కురుపాం మండలం పొడి గ్రామంలో గిరిజన కో. ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో శ్రీ మేనేజర్ వి. క్రిష్ణ ప్రసాద రావు, సూపరింటెండెంట్ యం. సాంబశివ రావు మరియు సిబ్బంది డిపో ఆవరణలో మాట్లాడుతూ.. వివిధ గ్రామాల నుండి వచ్చిన గిరిజనులను ఉద్దేశిస్తూ గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులు ఎలా సేకరించాలి,వాటి నిల్వ ఎలా చేయాలి, కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధానం గూర్చి మరియు 202425 సం. లకు గాను గిరిజన సహకార సంస్థ ప్రకటించిన మద్దతు ధరను కరపత్రాల రూపములో అందరికీ పంపిణి చేయడం జరిగింది. శాండీ పాయింట్ లోనే కాకుండా మీ డిపోలలో కూడా అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయడం జరుగుతుందని మరియు మీరు మీ యొక్క అటవీ ఫలసాయములను మీదగ్గర గ్రామాలలో ఉన్నవని మాకు తెలియపరిచినచో మా సిబ్బంది వచ్చి కొనుగోలు చేయుదురని శ్రీ మేనేజర్ వారు వివిధ గ్రామాల నుండి వచ్చిన గిరిజనులకు తెలియపరచడం జరిగింది. ఈ కార్యక్రమములో సేల్స్ మెన్ లు టి. మధు, రవి కుమార్, మిన్నారావు మరియు జగదీశ్ కుమార్ లు పాల్గొన్నారు.

## వరంగల్ ను రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తాం

రాష్ట్ర మంత్రివర్యులు కొండా సురేఖ



**వరంగల్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత అంతటి ప్రాధాన్యం ఉన్న వరంగల్ ను రెండో రాజధానిగా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోందని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మాత్యులు కొండా సురేఖ తెలిపారు. మంగళవారం వరంగల్ తూర్పు నియోజక వర్గ బల్దియా పరిధిలోని 12, 21, 24, 32, 41 వ డివిజన్లలో కోటి 50 లక్షల రూపాయల బల్దియా సాధారణ నిధులతో సి సి రోడ్ లు డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నగర మేయర్ గుండు సుధారాణి, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని వాకడే, అదనపు కలెక్టర్ సంధ్య రాణి కార్పొరేటర్లు కావేటి కవిత, ముహమ్మద్ ఫుర్ఖాన్, పోశాల పద్మ, పల్లం పద్మ, రామా తేజేశ్వి శిరీష్, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, బల్దియా ఈ ఈ శ్రీనివాస్, తహసీల్దార్ ఇక్బాల్ ,డి ఈ రాజ్ కుమార్ ఏ ఈ హారి కుమార్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో తెలంగాణ రూపురేఖలు మార్చే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రణాళికలు రూపొందించి ముందుకు వెళుతున్నట్లు తెలిపారు.